15-2Pg1exHMNWJQE.qxd:15-2Pg1exHMNWJQE.qxd 15/02/26 12:02 AM Page 1

సండే మ్యాగజైన్ (ఆదివారం అనుబంధం)
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

అనంతపురం

fb.com/vaartha Digital

నేతలతో మంత్రి లోకేష్ ఆత్మీయ సమ్మేళనం 2లో

దేశంలో తొలిసారిగా ఎమర్జెన్సీ లాండింగ్

Published from Anantapur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

15-2-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 15 పేజీలు: 08+4 వెల: 8.00

# ప్రగతి బాటల పద్దు

## అభివృద్ధి, సంక్షేమాల జోడెద్దులతో పరుగు



శనివారం అసెంబ్లీలో బడ్జెట్‌ను సమర్పిస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్

### ఏ రంగానికి ఎంత?
(రూ.వేల కోట్లు)

అమరావతి నిర్మాణం: 6,000
విద్యుత్ 13,934
రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులు: 13,546
విబిరామ్‌జీ: 8,365
గృహ నిర్మాణం: 5,451
పరిశ్రమలు: 3,161
స్వచ్ఛభారత్ మిషన్: 1,037
ఎన్టీఆర్ వైద్యసేవ: 4,000
జల్‌జీవన్: 4,000
మేజర్ ఇరిగేషన్: 9,906
అన్నదాత సుఖీభవ: 6,600
పోలవరం ప్రాజెక్టు: 6,105
రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: 1,927
ధరల స్థిరీకరణ నిధి: 500
ఎన్టీఆర్‌భరోసా: 27,719
దీపం(2.0): 2,601
స్త్రీశక్తి: 1420
ఉచిత విద్యుత్: 600
సాంఘిక సంక్షేమం: 11,118
ఇంధనశాఖ: 13,934

## 2026-27 రాష్ట్ర మొత్తం బడ్జెట్- రూ.3,32,205 కోట్లు

రెవెన్యూ వ్యయం: రూ.2,56,143 కోట్లు ❖ మూలధనవ్యయం: రూ.53,915 కోట్లు

రెవెన్యూలోటు: రూ. 22,002కోట్లు ❖ ద్రవ్యలోటు: రూ.75,868 కోట్లు

### వివిధ సంక్షేమ పథకాలకు భారీగా కేటాయింపులు జరిపిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విధ్వంసం నుంచి వికాస దిశగా 2024 జూన్‌నుంచి ఏపీ చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం పాలనసాగుతుందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేసారు. 2019-24 మధ్య 10.3శాతం ఆర్థికవృద్ధిని 2024-25లో 11,75శాతానికి పెంచామన్నారు. శాసనసభలో 2026- 27 ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టారు. వరుసగా మూడోసారి పయ్యావుల బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఒకసారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్, 2 సార్లు పూర్తి స్థాయి బడ్జెట్‌లను మంత్రి ప్రవేశ పెట్టారు. బడ్జెట్‌లో రూ. 3,32,205 కోట్లు అంచనా వ్యయం, రూ.2,56,143 కోట్లు, రెవెన్యూ వ్యయంగా,రూ.53,915 కోట్లు మూలధన వ్యయంగా ప్రతిపాదించారు. రెవెన్యూ లోటుగా రూ.22,002 కోట్లు, ద్రవ్య లోటుగా రూ.75,868 కోట్లు చూపించారు.బడ్జెట్‌లో ఏ రంగాలకుఎంత కేటాయించింది మంత్రి వివరించారు.ఆర్థిక ప్రణాళికను సభకు సమర్పించే క్రమంలో పయ్యావుల ప్రసంగిస్తూ తమ దృష్టిలో బడ్జెట్ అంటే కేవలం పద్దుల ప్రకటన కాదని రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని జోడెద్దుల బండిలా పరుగుల పెట్టించాలనే సంకల్పం లాంటిదని మంత్రి పేర్కొన్నారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్ లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్దరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని >>2



శనివారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రసంగాన్ని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

## ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్

### మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ లో పోలీసు శాఖలో తీసుకువచ్చిన ఆధునీకరణ, సంక్షేమ చర్యల గురించి ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ ప్రకటించారు. గత పాలనలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్దరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా మంచివారు భయపడనప్పుడు చెడు శక్తులు బలహీనమవుతాయి అని అమెరికా మాజీ అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ వ్యాఖ్యను ప్రస్తావించారు. పోలీసుశాఖకు 3000కొత్త వాహనాలను >>2

# సాగుకు చేయూత

రూ.53,752 కోట్లతో వ్యవసాయ, అనుబంధశాఖల బడ్జెట్

వ్యవసాయం: రూ.12,152 కోట్లు

సాగునీటిపారుదల: రూ.14,276 కోట్లు

ఉద్యానశాఖ: రూ.1,123 కోట్లు

మార్కెటింగ్: రూ.515 కోట్లు

పశుసంవర్థకశాఖ: రూ.1121 కోట్లు

మత్స్యశాఖ: రూ.523 కోట్లు



శనివారం అసెంబ్లీలో వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని ఏపీ వ్యవసాయశాఖా మంత్రి కింజరపు అచ్చెన్ననాయుడు అన్నారు.తద్వారానే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని వివరించారు. రైతులను రాజులుగా చేయడమే లక్ష్యంగా రైతన్న మీ కోసంఖి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని అచ్చెన్నాయుడు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రి టెక్నాలజీ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా వ్యవసాయ రంగాన్ని గుర్తించామన్నారు. వ్యవసాయ, అనుబంధ శాఖల బడ్జెట్ ను రూ.53,752 కోట్ల రూపాయల అంచనాలతో మంత్రి అచ్చెన్నాయుడు శాసన సభలో ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయ శాఖకు రూ.12,152 కోట్లు, సాగునీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణకు రూ.14,276 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.1,123 కోట్లు, అన్నదాత సుఖీభవకు రూ.6,600 కోట్లు, మార్కెటింగ్ శాఖకు రూ.515 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,121 కోట్లు, మత్స్యశాఖకు రూ.523 కోట్లు కేటాయిస్తున్నట్లు వివరించారు. బడ్జెట్‌లో వ్యవసాయంనీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, పోలవరం రూ.6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణనిధి రూ.500కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు. వీబీ జీ రామ్ జీ రూ.8,365 కోట్లు,గృహనిర్మాణం (పట్టణగ్రామీణ) రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ రూ.4,000 కోట్లు, జల జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, రీ ప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ రూ.2,144 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, నేషనల్ లైవ్లీహుడ్ మిషన్ రూ.955 కోట్లు, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌కు రూ.838 కోట్లు కేటాయించారు. స్వేదంతో భూమిని సేద్యం చేసే ప్రజల జీవనానికి అన్నం ప్రసాదించే రైతన్నలకు వందనాలు అంటూ మంత్రి అచ్చెన్నాయుడు తన ప్రసంగాన్ని ప్రారంభించారు. రైతును రాజుగా నిలబెట్టాలనే సంకల్పంతో వ్యవసాయ, అనుబంధ శాఖలు పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర2047 సాధన కోసం వ్యవసాయ రంగానికి సంబంధించి ఫార్మర్స్ అగ్రిటెక్ ప్రధాన సూత్రంగా ఉందని అన్నారు. ఇందులో భాగంగా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు అధిక ఆదాయ రంగంగా తీర్చిదిద్దేందుకు కృత్రిమ మేథ, డీప్ టెక్నాలజీ, డ్రోన్లు, రోబోటిక్స్, ఉపగ్రహ ఆధారిత వ్యవస్థలువంటి సాంకేతికతను ఉపయోగించుకుంటామని మంత్రి అచ్చెన్న తెలిపారు.

**రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా పంచసూత్రాల అమలు:** రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ >>2






### ఎపిపిఎస్సీలో అక్రమాలపై
## దర్యాప్తునకు సిట్
### చీఫ్‌గా సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యనార్

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ హయాంలో చేపట్టిన గ్రూప్1 నియామకాల్లో అక్రమాల దర్యాప్తుకు సిట్ ను ఏపీ ప్రభుత్వం నియమించింది. హైకోర్టు ఆదేశాల మేరకు సిట్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.ఏడీజీ, ఆపై అధికారి నేతృత్వంలో సిట్ నియమించాలని హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వానికి జారీ చేసింది. ఈ నెల 11న విచారించి ప్రత్యేక సిట్ నియామకానికి హైకోర్టుఆదేశాలిచ్చింది.దాంతో సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ నేతృత్వంలో సిట్‌ను ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.సిట్ సభ్యుడిగా సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి నియామకం అవసరమైతే దర్యాప్తు కోసం ఏ అధికారినైనా తీసు కోవచ్చున్న ప్రభుత్వం మార్చి16 లోగా సిట్ దర్యాప్తు తుది నివేదిక >>2

### 'సీమ' ఉద్యానహబ్‌కు
## రూ. 30వేల కోట్లు
### గ్రీన్‌ఫీల్డ్ సిటీగా అమరావతి
### క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి ప్రాధాన్యం

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమ ముఖచిత్రం మార్చింది తామేనని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు చెప్పారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాయలసీమ హార్టికల్చర్ హబ్‌కు 30వేలకోట్లు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేలంతా సంతోషంగా ఉన్నారని సీఎం అన్నారు. శనివారం సీఎం చంద్రబాబు అసెంబ్లీ లాబీలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అమరావతి అభివృద్ధిపైనా, ప్రకాశం, రాయలసీమ అభివృద్ధి మీద కీలక వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రం ఇంకా వైసీపీ పాలనలో వచ్చిన విధ్వంసం నుంచి పూర్తిగా కోలుకోవడానికి సమయం పడుతుందన్న చంద్రబాబు.. ప్రస్తుత బడ్జెట్ మెరుగైనది అయినప్పటికీ సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. ఆదాయం తక్కువ, ఖర్చులు ఎక్కువ అనే వారసత్వ సమస్యను కేంద్ర సహకారంతో మేనేజ్ చేస్తున్నామని తెలిపారు. అమరావతి విషయంలో చంద్రబాబు మాట్లాడుతూ, రెండు, మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని, రాజధానిని జాతీయ రహదారులకు అనుసంధానిస్తున్నామని చెప్పారు. దీంతో రాకపోకలు పెరిగి ఆదా యం వస్తుందని వివరించారు. రాజధాని అమరావతికి పశ్చిమ >>2

15-2Pg2exHNWMJQE.qxd:15-2Pg2exHNWMJQE.qxd 15/02/26 11:59 PM Page 1



# ప్రగతి బాటల పద్దు

>> సంప్రదింపులు జరిపా మన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ. 37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**2026-27 ఆర్థిక ప్రణాళికలో కేటాయింపులు**

202627 రాష్ట్ర బడ్జెట్‌లో వివిధ సంక్షేమ పథకాలు, వివిధ కార్యక్రమాలకు నిధులు కేటాయించారు. ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.27,719 కోట్లు, దీపం 2.0 రూ.2,601 కోట్లు, వివిధ వర్గాలకు ఆర్థిక మద్దతుకి రూ.2,320 కోట్లు, స్త్రీశక్తి రూ.1,420 కోట్లు, వీకర్ సెక్షన్లకు సబ్సిడీ, ఉచిత విద్యుత్ రూ.600 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో రూ.450 కోట్లు, తల్లికి వందనం రూ.9,668 కోట్లు, స్త్రీ, శిశు సంక్షేమం రూ.4,581 కోట్లు, ఉపకారవేతనాలు రూ.3,836 కోట్లు, రూ.సమగ్ర శిక్ష 2,946 కోట్లు, రూ.ఉన్నత విద్య 2,566 కోట్లు కేటాయించారు.

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకానికి రూ.2,161 కోట్లు, మన బడి, మన భవిష్యత్ రూ.1,500 కోట్లు, నైపుణ్యాభివృద్ధి రూ.1,232 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రూ.654 కోట్లు, యువత, క్రీడలకు రూ.438 కోట్లు, వీబీజీ రామ్‌జీకి రూ.8,365 కోట్లు, గృహ నిర్మాణం రూ.5,451 కోట్లు, ఎన్టీఆర్ వైద్య సేవ రూ.4,000 కోట్లు, జల్‌జీవన్ మిషన్ రూ.4,000 కోట్లు, స్వచ్ఛభారత్ మిషన్ రూ.1,037 కోట్లు, ఆయుష్మాన్ భారత్ రూ.838 కోట్లు కేటాయించారు. వ్యవసాయం, నీటి భద్రత కేటాయింపులు 202627 రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయంనీటి భద్రత కేటాయింపులు చేశారు. మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.9,906 కోట్లు, అన్నదాత సుఖీభవ రూ.6,600 కోట్లు, రూ.పోలవరం 6,105 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన రూ.1,927 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి రూ.500 కోట్లు, మత్స్యకార సేవలో రూ.260 కోట్లు, పంటల బీమా రూ.250 కోట్లు, పీఎం కృషి సించాయి యోజన రూ.190 కోట్లు కేటాయించారు.

**మూలధన వ్యయం పెంపు:** మూలధన వ్యయాన్ని గత బడ్జెట్ కంటే ప్రభుత్వం పెంచింది. 2025- 26 రివైజ్డ్ అంచనాల్లో మూలధన వ్యయం 39,497.56 కోట్లు ఉండగా, 202627 బడ్జెట్ అంచనాల్లో మూలధన వ్యయం రూ.53,915.38 కోట్లు పెంచింది. గత ఏడాది కంటే మూలధన వ్యయాన్ని రూ.14,417.82 కోట్ల మేర ప్రభుత్వం పెంచింది. మూలధన వ్యయం పెంచడం ద్వారా ఆస్తుల కల్పనకు ప్రభుత్వం పెద్ద పీట వేసిందని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. మూలధన వ్యయానికి ఎక్కువ కేటాయింపులు జరపలేదని గత ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయని మూలధన వ్యయం కేటాయింపుల విషయంలో నాటి వైఎస్సార్సీపీ ప్రభుత్వ విధానాన్ని వివిధ సందర్భాల్లో కాగ్ తప్పు పట్టిందని పయ్యావుల వెల్లడించారు.

**పన్నుల ద్వారా ఆదాయం:** 2026- 27 రాష్ట్ర బడ్జెట్‌లో రూపాయి రాక పన్నుల ద్వారా ఆదాయం 38 శాతం, పన్నేతర ఆదాయం – 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు – 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా – 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ – 10 శాతం ఉంది. రూపాయి పోక సంక్షేమం – 17 శాతం, విద్య – 11 శాతం, ఆర్థికం – 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి –7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం – 6 శాతం, జలవనరులు – 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ – 4 శాతం, విద్యుత్ రంగం – 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు -4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) – 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు – 18 శాతంగా పేర్కొన్నారు.

**రెవెన్యూ లోటు, ద్రవ్యలోటు:** రెవెన్యూ లోటు గణనీయంగా తగ్గింది. 2025 26 రివైజ్డ్ అంచనాల ప్రకారం రెవెన్యూ లోటు రూ.41,118.36 కోట్లు ఉండగా, 202627 బడ్జెట్ అంచనాల ప్రకారం రూ.22,002.50 కోట్లు ఉండనుంది. 202526 రివైజ్డ్ అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.80,567.47 కోట్లు ఉంటే, 202627 బడ్జెట్ అంచనాల ప్రకారం ద్రవ్య లోటు రూ.75,868.09 కోట్లు ఉండనుంది. న్నుల ద్వారా ఆదాయం – 38 శాతం, పన్నేతర ఆదాయం – 3 శాతం, బహిరంగ మార్కెట్ రుణాలు – 30 శాతం, కేంద్ర పన్నుల్లో వాటా – 19 శాతం, గ్రాంట్ ఇన్ ఎయిడ్ – 10 శాతం రానుంది. సంక్షేమం ద్వారా 17 శాతం, విద్య – 11 శాతం, ఆర్థికం – 8 శాతం, పంచయతీరాజ్, గ్రామీణాభివృద్ధి – 7 శాతం, వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమం – 6 శాతం, జలవనరులు – 6 శాతం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్ మెంట్ – 4 శాతం, విద్యుత్ రంగం – 4 శాతం, వ్యవసాయం, అనుబంధ రంగాలు – 4 శాతం, ఇతరాలు (హోం, ఆర్ అండ్ బీ, పరిశ్రమలు) – 15 శాతం, వడ్డీలు, రుణాల చెల్లింపులు – 18 శాతం జరుగనున్నాయి.

**ప్రజలకు తెలియాలనే ప్రస్తావించాం**

ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న వివిధ రకాల చర్యలను బడ్జెట్ లో మంత్రి పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల చెల్లింపులు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణ చర్యలను మంత్రి బడ్జెట్లో ప్రస్తావించారు. స్థానిక సంస్థలకు బదలాయించిన నిధులు, అధిక రుణాలపై వడ్డీలను తగ్గించేందుకు జరిపిన సంప్రదింపుల వివరాలను బడ్జెట్లో ప్రభుత్వం పొందుపరిచింది. గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలకు తెలియచేయడం కోసమే వివరాలను బడ్జెట్టులో ప్రస్తావించామని ప్రభుత్వం వర్గాలు తెలిపారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై వడ్డీలు తగ్గించమని వివిధ సంస్థలతో సంప్రదింపులు జరిపామని మంత్రి పయ్యావుల వెల్లడించారు. 12.3 శాతంగా ఉన్న వడ్డీని 9 శాతానికి తగ్గించేలా ఆయా ఆర్థిక సంస్థలను ఒప్పించామన్నారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాల్లో ఇప్పటి వరకు రూ.43,298 కోట్ల మేర రుణాలకు వడ్డీలు తగ్గించాలని సంప్రదింపులు జరిపామన్నారు. సంప్రదింపుల ఫలితంగా ఏడాదికి రూ.327 కోట్ల మేర ఆదా అయిందని తెలిపారు. మరో రూ.1.20 లక్షల కోట్లకు వడ్డీ రేట్లు తగ్గించాలని సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. గత ప్రభుత్వం పెండింగులో పెట్టిన బిల్లుల్లో రూ.24,811 కోట్లు చెల్లింపులు జరిపామన్నారు. ఆర్థిక కార్యాకలాపాల పునరుద్ధరణకు ఇరిగేషన్, రహదారుల పనుల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి రూ.37,030 కోట్లు వ్యయం చేశామన్నారు. పంచాయతీలు, మున్సిపాల్టీల బలోపేతం నిమిత్తం ఇప్పటి వరకు ఫైనాన్స్ కమిషన్ నిధులను రూ.3,797 కోట్ల మేర బదలాయించామన్నారు.

**స్కీంల పునరుద్ధరణకు రూ.18,701 కోట్లు ఖర్చు**

గత ప్రభుత్వం నిలిపేసిన కేంద్ర ప్రాయోజిత పథకాల్లో 85 స్కీంల పునరుద్ధరణకు రూ.18,701 కోట్లు ఖర్చు పెట్టామని దీని ఫలితంగా కేంద్రం నుంచి నిధుల విడుదల మరింతగా పెరిగిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పునరుద్ధరించడానికి తెచ్చిన వివిధ సంస్కరణలను బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. సాస్కి కింద ఇప్పటి వరకు రూ.6,544 కోట్ల మేర నిధులను వినియోగించుకున్నామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మరో రూ.1,438 కోట్లు సాస్కి నిధులను వినియోగించుకునే అవకాశం ఉందని అన్నారు.

సంపద సృష్టిలో భాగంగా ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటును మంత్రి పయ్యావుల ప్రతిపాదించారు. రూ.100 కోట్ల కార్పస్ తో ఏపీ వెల్త్ ఫండ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఏపీ వెల్త్ ఫండ్ ద్వారా దేశంలోని వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులను ప్రభుత్వం పెట్టనుంది. ఈ మేరకు ఏపీ వెల్త్ ఫండ్ లో భాగస్వాములు కావాల్సిందిగా ప్రైవేట్ ఇన్వెస్టర్లను ఆహ్వానిస్తున్నట్టు బడ్జెట్‌లో వెల్లడించారు. వివిధ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం చేకూర్చేలా ప్రభుత్వం ప్రణాళికలు చేసింది.



శనివారం బడ్జెట్ పత్రాలను సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్‌కు అందచేస్తున్న ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్



బడ్జెట్ ప్రతులను చదువుతున్న మంత్రులు, శాసనసభ్యులు

## ఏ రంగానికి ఎంత?
## (రూ.వేల కోట్లు)

తల్లికి వందనం: 9,668

స్త్రీ, శిశు సంక్షేమం: 4,581

ఉపకార వేతనాలు: 3,836

సమగ్రశిక్ష : 2,946

ఉన్నత విద్య: రూ.2,566

డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం:2,161

మన బడి మన భవిష్యత్: 1,500

నైపుణ్యాభివృద్ధి: 1,232

పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా: 707

సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర: 654

యువత, క్రీడలు: 438

వ్యవసాయ అనుబంధ రంగాలు: 13,598

పంచాయతీరాజ్ శాఖ : 22,942

మున్సిపల్‌శాఖ :14,539

జల వనరుల శాఖ : 18,224

పాఠశాలవిద్యాశాఖ: 32,308

ఇంధనశాఖ: 13,934

సాంఘిక సంక్షేమ శాఖ:11,118

కార్మిక శాఖ: 735

గృహ నిర్మాణశాఖ రూ.6357

హోంశాఖ రూ.9,165

విశాఖ ఆర్థిక ప్రాంతానికి: 28,000

విశాఖ ఆర్థిక ప్రాంతం పరిధిలోకి పది జిల్లాలు

# సాగుకు చేయూత

>> ప్రాసెసింగ్, ప్రభుత్వం నుంచి మద్దతు అనే పంచసూత్రాల అమలుతో రాష్ట్ర వ్యవసాయానికి కొత్త ఊపిరి పోస్తున్నామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, 62 శాతం జనాభా వ్యవసాయ,అనుబంధ రంగాలపై ఆధారపడిన రాష్ట్రంలో రైతును "రాజు"గా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత:** 202526 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 33.20 శాతంతో రూ.5,39,454 కోట్లు సాధించినట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలోని 8,357 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. ధరల స్థిరీకరణ నిధి కింద రూ.500 కోట్లు ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించారు. 2026-27 నాటికి పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తిలో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెడతామని చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 50 వేల గోకులాలను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా ఏపీ రూ.21,246 కోట్ల ఆదాయం పొందుతోందని దీన్ని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందిచామని వివరించారు.

**కర్షకుల అభివృద్ధికి కృషి**

ఆక్వా కల్చర్ అభివృద్ధి, మంచినీటి చేపల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నట్లు మంత్రి అచ్చెన్న చెప్పారు. ఎన్టీఆర్ జలసిరి కింద 2026-27లో రైతులకు ఉచితంగా బోర్లు వేయడంతో పాటు, మోటర్లు పంపిణీ చేస్తామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. నేల, నీరు, రైతు భద్రతే రాష్ట్ర భవిష్యత్తుగా భావిస్తున్నామని ఇదే కోవలో కర్షకుల అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేస్తూ వ్యవసాయ బడ్జెట్‌ను అసెంబ్లీ ముందుంచారు.



## సిఎం చంద్రబాబును కలిసిన శివతత్వ చీరలు ధరించిన మహిళా ప్రజాప్రతినిధులు

**విజయవాడ.ఫిబ్రవరి14,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. రేపటి మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని, కూటమి ప్రభుత్వానికి చెందిన మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు శివతత్వానికి ప్రతీకగా ఉన్న చీరలను ధరించి సభకు హాజరయ్యారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం వీరంతా ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివుని వలే సమస్త ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న చంద్రబాబును వారు ఈ సందర్భంగా అభినందించారు. ఆడబిడ్డలకు ఎప్పుడు అండగా ఉంటానని సీఎంకే రకమైన వస్త్రధారణతో అసెంబ్లీకి విచ్చేసిన మహిళా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవితతో పాటు ఇతర మహిళా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ మహిళా నేతలు ఈ విధంగా ప్రత్యేకతను చాట దంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం, అసెంబ్లీ లాబీల్లో ఈ మహిళా ప్రజాప్రతినిధులు స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హిందూపురం ఎమ్మెల్యేనందమూరి బాలకృష్ణలను కూడా కలిసి మాట్లాడారు.

## ప్రజలకు సిఎం చంద్రబాబు మహాశివరాత్రి శుభాకాంక్షలు

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. శ్రీశైల జ్యోతిర్లింగ క్షేత్రం కొలువై ఉన్న పవిత్ర భూమి మన రాష్ట్రం. భక్త సులభుడైన శివుడు ఈ రోజే లింగాకారంలో ఆవిర్భవించాడని శివపురాణం చెబుతోంది. ఈ పర్వదినాన శివారాధనతో మహాశివుని అనుగ్రహం కలిగి అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను.

శివార్చన, జాగరణలతో మహా శివరాత్రిని భక్తిశ్రద్ధలతో జరుపుకుందాం. పరమశివుని అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నాను.

# రేపు బిల్ గేట్స్ అమరావతి రాక

**విజయవాడ.ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** బిల్ గేట్స్ ఫిబ్రవరి 16న ఆంధ్రప్రదేశ్ కు రానున్నారు. మొదట ఈ పర్యటన ఈనెల 18వ తేదీన ఉంటుందని అందరు భావించినా 2రోజుల ముందుగానే ఆయన రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ పర్యటన రాష్ట్రంలో ఒక్క రోజే ఉంటుందా? లేక రెండు రోజులు? ఉంటారా? అనే దానిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో భాగంగా పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమీక్షలో పాల్గొంటారని సమాచారం. రాష్ట్రంలో విద్య, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో మెరుగైన ఫలితాలకు తి। పరిజ్ఞానాన్ని అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బిల్, మెలిండా గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే ఓ ఒప్పందాన్ని సైతం కుదుర్చుకుంది. అదేవిధంగా అత్యుత్తమ సాంకేతికత ద్వారా ప్రజల ఆరోగ్య అంశాలను పర్యవేక్షి ంచేలా ప్రాజెక్టును కూడా చేపట్టింది. అంతేగాక బిల్ గేట్స్ ఫౌండేషన్ చేయూతతో రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేయనుంది. ఇప్పటికే చిత్తూరు జిల్లాలో సంజీవని ప్రాజెక్టును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇలాంటి విషయాలతో పాటు మరికొన్నివాటిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో జరిగే సమావేశంలో మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ చర్చిస్తారని సమాచారం.

అలాగే రాజధాని అమరావతిలోని క్వాంటమ్ వ్యాలీలో మైక్రోసాఫ్ట్ పెట్టే పెట్టుబడులపైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అనంతరం ఫిబ్రవరి 19వ తేదీన దిల్లీలో జరిగే ఎఐ సమిట్‌లో బిల్ గేట్స్ పాల్గొంటారు. సీఎం చంద్రబాబు సైతం ఈ సదస్సుకు హాజరవుతారు.

# నేతలతో మంత్రి లోకేష్ ఆత్మీయ సమ్మేళనం

**విజయవాడ,ఫిబ్రవరి 14,ప్రభాతవార్తప్రతినిధి:** రాజకీయ వ్యూహాలు, అసెంబ్లీ బడ్జెట్ చర్చల బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ.. మంత్రి నారా లోకేష్ ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం మధ్యాహ్నం ఉండవల్లిలోని.. ఆయన నివాసంలో గుంటూరు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వారి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం వనభోజనాల తరహాలో అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాజకీయ చర్చలకు తావులేకుండా, కేవలం కుటుంబ విషయాలు, పిల్లల చదువులు, వారికి గల క్రీడాభిలాషపై మాట్లాడుకున్నారు. సమావేశానికి వచ్చిన చిన్నపిల్లలతో లోకేష్ సరదాగా కబుర్లు చెబుతూ గడిపారు. చదువు, కెరీర్ ఒక్కటే జీవితం కాదు.. పిల్లలు క్రీడలను కూడా కెరీర్‌గా ఎంచుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలిఖి అని లోకేష్ ఈ సందర్భంగా సూచించారు. తన నియోజకవర్గమైన మంగళగిరిలోని చేనేత కార్మికులకు అండగా నిలిచేందుకు లోకేష్ ప్రతి అవకాశాన్నీ వాడుకుంటున్నారు.



విజయవాడ,గుంటూరు నేతలతో కలిసి భోజనం చేస్తున్న లోకేశ్

ఈ సమావేశానికి వచ్చిన ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులకు ప్రత్యేకంగా మంగళగిరి చేనేత చీరలను కానుకగా అందజేసి తన నియోజకవర్గ బ్రాండింగ్‌ను చాటుకున్నారు.

## అన్ని రంగాలకు ప్రాధాన్యం: బిటి నాయుడు

**సచివాలయం,ఫిబ్రవరి 14,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రివిలేజ్‌కమిటీ చైర్మన్ బి.టి. నాయుడు అన్నారు. బడ్జెట్ సందర్భంగా బిటి నాయుడు మీడియాతో మాట్లాడారు. ప్రధానంగా విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధికంగా కేటాయింపులు చేయడం హర్షణీయమన్నారు.

## బడ్జెట్‌కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

**విజయవాడ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ సీఎం చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం భేటీ అయ్యింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రతులను సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లను అందజేశారు. 2026-27 వార్షిక బడ్జెట్‌కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# ప్రతి జిల్లాలో సైబర్ క్రైం పోలీస్ స్టేషన్

>> త్వరలో అందించనున్నాం. డిజిటల్ అరెస్టులు, ఆన్‌లైన్ మోసాలు వంటి ఆధునిక నేరాలను ఎదుర్కొనేందుకు ప్రతిజిల్లాల ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీసు స్టేషన్ ఏర్పాటు. స్మార్ట్ పోలీసింగ్ ల్యాబ్‌ల స్థాపన, కృత్రిమ మేధస్సు ఆధారిత ప్రాజెక్టులు, ఆధునిక కమ్యూనికేషన్, భద్రతా పరికరాలు, సీసీటీవీ, డ్రోన్ వినియోగంతో సాంకేతికంగా దృఢమైన పోలీసు వ్యవస్థ నిర్మాణం. కొత్త ఏపీ పోలీసు అకాడమీ స్థాపన కోసం 94 ఎకరాలు కేటాయించాలమని మంత్రి చెప్పారు. నిర్మాణ పనుల ప్రారంభానికి ఈ సంవత్సరంలో రూ.15 కోట్ల కేటాయింపులను ప్రభుత్వం ప్రతిపాదించింది. శ్రీకాకుళం, రాజమంత్రి, ప్రకాశం, చిత్తూరు జిల్లాల్లో 4 కొత్త ఇండియా రిజర్వ్ ఏపీఎస్పీ బెటాలియన్‌లను ప్రారంభించి 3920 పోస్టులను మంజూరు చేశాం. పౌర–పోలీసు నిష్పత్తిని మెరుగుపర్చేందుకు 5757 స్టైపెండరీ కేడెట్ ట్రైనీ కానిస్టేబుళ్లను నియమించాం. శిక్షణ సమయంలో వారికి ఆర్థిక మద్దతుగా నెలవారీ భత్యం రూ.4500 నుంచి 12000కు పెంపు. పోలీసు సిబ్బందికి బకాయి ఉన్న టీఏ, డీఏలు, సెలవు సంబంధిత బకాయిలు, వైద్య రీయింబర్స్‌మెంట్ తదితర చెల్లింపుల కోసం దాదాపు రూ.500 కోట్ల విడుదల. పోలీసు కానిస్టేబుల్ నుంచి డీజీపీ వరకు రూ.20 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ఉచిత బీమా కవరేజీ కల్పించే గ్రూప్ పర్సనల్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ పథక పునరుద్ధరణ. గత ఐదేళ్లుగా విస్తరించిన గంజాయి సమస్యకు ప్రత్యేక విభాగం ఈగల్ ద్వారా, డ్రోన్ల వినియోగంతో కట్టడి. మహిళల భద్రత కోసం శక్తి యాప్‌ను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. దీనిద్వారా 7 నిమిషాల్లోనే స్పందన లభిస్తుంది. వేధింపులకు పాల్పడేవారిపై కఠినచర్యలు ఉంటాయన్నారు.

# 'సీమ' ఉద్యానహాబ్‌కు
# రూ. 30వేల కోట్లు

>> బైపాస్‌వల్ల యాక్సెస్ పెరిగిందని, ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌లతో మరింత యాక్సెస్ మెరుగుపడుతుందని సీఎం పేర్కొన్నారు. ఇది అమరావతిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ఉంటుంది. ఇది కేవలం రాజధాని నగర అభివృద్ధి మాత్రమే కాదు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకంఖి. అని చంద్రబాబు చెప్పారు. కూటమి ప్రభుత్వం అమరావతిని గ్రీన్‌ఫీల్డ్ సిటీగా తీర్చిదిద్దుతోందని సీఎం తెలిపారు. ఇటీవల క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన చేసి, అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా మార్చాలనే లక్ష్యం ప్రకటించామని.. ఇది హైదరాబాద్ ఐటీ రివల్యూషన్‌తో పోల్చదగిన మరో విప్లవం అవుతుందని ఆయన అన్నారు. ప్రపంచంలో టాప్3 క్వాంటం వ్యాలీల్లో అమరావతి ఒకటిగా నిలవాలనేది మన దీర్ఘకాలిక దృష్టి అని చంద్రబాబు తెలిపారు. అదే సమయంలో, రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చడంపై సీఎం సంతోషం వ్యక్తం చేశారు. ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరకని రాయలసీమలో ఇప్పుడు దేశంలోనే ఉత్తమ పండ్లు (ముఖ్యంగా దానిమ్మ) పండుతున్నాయని, అప్పుడు తెచ్చిన హంద్రీనీవా ప్రాజెక్టు ఫలితాలు ఇప్పుడు కనిపిస్తున్నాయని చెప్పారు. రాయలసీమ, ప్రకాశం, మార్కాపురం ప్రాంతాలను గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు.. 500 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నామని చంద్రబాబు వెల్లడించారు. వచ్చే 23 ఏళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టామని సీఎం చంద్రబాబు అన్నారు. వైఎస్సార్సీపీ విధ్వంసం నుంచి కోలుకోవాలంటే ఇంకా సమయం పడుతుందన్నారు. ఇబ్బందులు అధిగమించిఇప్పుడిప్పుడే ట్రాక్‌ఎక్కుతున్నామన్నారు.

## దర్యాప్తునకు సిట్

>> సమర్పించాలని ప్రభుత్వం ఆదేశం సహకారం అందించాలని హోంశాఖ ముఖ్య కార్య దర్శి, డీజీపీకి ప్రభుత్వం ఆదేశం సిట్‌కు సహకారం అందించాలని అన్ని విభాగాధిపతులకు ప్రభుత్వం ఆదేశం తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశాలు జారీ చేసారు.

## వారం - వర్జ్యం

15-02-2026, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మాఘమాసం, ఉత్తరాయణం
శిశిర ఋతువు, కృష్ణపక్షం, ధనిష్ఠ కార్తె
త్రయోదశి సా.5.01
ఉత్తరాషాఢ రా.7.44
వర్జ్యం : రా.11.54-1.34
దు.సా.4.36-6.11
శుభసమయం : ఉ.5.30-6.30,సా.6.30-7.30
రాహుకాలం – సా.4.30-6.00

## వారఫలం

**మేషం:** మీ పలుకుబడి అన్ని విధాలుగా ఉపయోగించి ఉద్యోగపరమైన ఒత్తిళ్ళను తట్టుకుంటారు. చిరకాల స్వప్నం నెరవేరే సమయం.

**వృషభం:** అధిక శ్రమవలన ఆరోగ్యపరంగా కొద్దిపాటి ఒడిదుడుకులు ఉంటాయి. అన్ని విషయాలలో పురోగతి వుంటుంది.

**మిథునం:** లాభాలు మాత్రం చేతికందవు. సమయం పడుతుంది. సర్దుబాటు చేసే కొద్ది మరికొన్ని పుట్టుకొస్తాయి.

**కర్కాటకం:** ఉద్యోగపరంగా మీస్థాయి తగ్గనున్నదని శత్రువర్గం ప్రచారం అధికం అవుతుంది. ఆర్థికపరమైన ఒత్తిళ్ళు.

**సింహం:** సంతాన పురోగతిపై పునః పరిశీలన చేసి కొన్ని కొత్త నిర్ణయాలు అమలు చేస్తారు. వాహనయోగం.

**కన్య :** కుటుంబ గౌరవానికి హాని ఉండదు. ఎంతో కృషిచేసినా నామమాత్రపు ఫలితాలు సాధిస్తారు. కొత్త మిత్రులు పరిచయమవుతారు.

**తుల :** ఉద్యోగములో కొందరు స్వార్థపరులు మీపై చేసే దుష్ప్రచారము వలన మానసిక ప్రశాంతతను కోల్పోతారు.

**వృశ్చికం:** వాహనముల మరమ్మతులకు గాను అధిక ధనవ్యయము సంభవము. మిత్రులను కలుసుకుంటారు.

**ధనుస్సు:** కోర్టు సంబంధమైన వ్యవహారములలో మధ్యవర్తుల సహాయ సహకారములను పొందుతారు.

**మకరం:** వ్యక్తిగత విషయములలో సంయమనము పాటించండి. ఇంటియందు శుభకార్యాలు జరుగుతాయి.

**కుంభం:** ఒక అవకాశం వెతుక్కుంటూ రాగలదు. వ్యాపారాలకు సంబంధించిన ఒప్పందాలు కుదురుతాయి.

**మీనం:** మీ ఆస్తుల సంపూర్ణ వివరాలు మీ సన్నిహితులకు కూడా తెలియకుండా జాగ్రత్తపడతారు. ప్రయాణాలు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

నకిలీ విత్తనాలు ప్రతీ ఏటా రైతులను నట్టేట ముంచుతున్నా ప్రభుత్వం స్పందించి అన్నదాతలను ఆదుకునేందుకు చేపడుతున్న నిర్మాణాత్మక చర్యలు మృగ్యమయ్యాయి. వానకాలం సీజన్‌లో నకిలీ విత్తనాల బెడద రైతులను పట్టి పీడిస్తున్నది. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో నివారించలేని పరిస్థితి ఉంది. నగర శివారు ప్రాంతాల్లో నకిలీ విత్తనాలు తయారు చేస్తూపేరుమోసిన కంపెనీల బ్రాండ్ కవర్లలో వాటిని రైతులకు అంటగడుతున్నారు. పలు కంపెనీలకుచెందిన డీలర్లు నకిలీ విత్తనాలను గ్రామాల్లో ఎకువగా విక్రయిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారులు విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారే తప్పా గ్రామాల వైపు కన్నెత్తి చూడడంలేదు. దీంతో వారి ఆగడాలు మితిమీరుతున్నాయి. రైతులను నకిలీ విత్తన మోసాలనుంచి కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో విత్తన చట్టం తీసుకురావడానికి సిద్ధమవుతోంది. ఈ చట్టం అమలైతే రైతులకు నాణ్యమైన విత్తనం చట్టబద్ధహక్కుగా మారనుంది. నాణ్యమైన విత్తనం రైతులకు అందుబాటులోకివస్తే సాగులో నెలకొన్న సగం సమస్యలు దూరమైనట్టే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రప్రభుత్వం తేబోతున్న కొత్త విత్తన చట్టం రైతులను ఏమేరకు ఆదుకుంటోందో వేచిచూడాలి. అదే సమయంలో రైతులకు సకాలంలో రైతు భరోసాపథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని అందించాల్సిన అవసరం ఎంతో ఉంది. మరోవైపు ఈ యాసంగి సీజన్‌లో మార్చి మూడో సీజన్‌లో ప్రారంభం కావాల్సిన అధిక ఉష్ణోగ్రతలు ఫిబ్రవరి మొదటి వారంలోనే మొదలవడంతో యాసంగి పంటలకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. యాప్‌ల వినియోగంలో రైతులు ఎదుర్కొంటున్న పలు ఇబ్బందులను పరిష్కరించడంపై, వాటి వినియోగంపై తగినంత అవగాహన కల్పించడంలో ప్రభుత్వాలు చిత్తశుద్ధితో వ్యవహరిస్తే యాసంగి సాగు రైతులకు లాభసాటిగా మారనుంది.

# యాప్‌లతో అన్నదాతలకు కష్టాలే!

**బోగిని మల్లికార్జున్**

ఇప్పటికే సవాళ్ల మధ్యన సాగును ముందుకు తీసుకెళ్తున్న అన్నదాతలకు కొత్తగా యాప్ కష్టాలు వెంటాడుతున్నాయి. యాప్‌ల వినియోగం అన్నదాతలకు సవాల్‌గా మారుతోంది. ఫలితంగా సాగులో రైతుల సమస్యలు రెట్టింపవుతున్నాయి. ప్రధానంగా పత్తి విక్రయాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కిసాన్ కపాస్‌యాప్, రైతులకు సరిపడినంత యూరియాను సకాలంలో అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ అన్నదాతల సమస్యలను తగ్గించాల్సింది పోయి మరిన్ని కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. రైతులందరి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఇప్పటికీ మెజారిటీ రైతులు నిరక్షరాస్యులు కావడం,ఒకవేళ స్మార్ట్‌ఫోన్ ఉన్నా యాప్‌ల వినియోగంపై అవగాహన లేకపోవడం కర్షకులకు శాపంగా మారుతోంది. మరికొందరికి పట్టాదారు పాస్‌బుక్‌కు మొబైల్ నంబర్ లింక్ చేసుకోకపోవడంతో యాప్‌ల ద్వారా పంటలను అమ్ముకోవాలన్నా, ఎరువులు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. కిసాన్‌కపాస్ యాప్‌తో పత్తి విక్రయాల్లో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నట్టుగానే యూరియా కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫర్టిలైజర్ యాప్‌తో రైతుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. యూరియా యాప్‌లో రైతు పాస్‌బుక్, ఫోన్ నంబర్ నమోదు చేసుకున్న తర్వాత చాలా షాపుల్లో జీరో స్టాకే దర్శనమిస్తుండడంతో రైతులు తీవ్రఆందోళనలో కూరుకుపోతున్నారు. రాష్ట్రంలో అత్యధిక విస్తీర్ణంలో సాగవుతున్న వరి సాగును ఖరీఫ్ మాదిరిగానే యాసంగిలోనూ యూరియా కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. యూరియా కోసం రైతులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. అయితే ఈ యాసంగిలో అన్నదాతలకు యూరియా కష్టాలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాప్ ద్వారా పంపిణీని చేపట్టింది. ఇందుకు ప్రత్యేకంగా ఫర్టిలైజర్స్ బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినప్పటికీ అన్నదాతలకు కష్టాలు తప్పని పరిస్థితి నెలకొంది. ఇప్పటికీ సాగులో ఎక్కువగా పాతతరం రైతులే ఉండడంతో వారి వద్ద స్మార్ట్‌ఫోన్లు లేవు. ఫలితంగా యాప్‌లో యూరియా బుక్ చేయడం అసాధ్యంగా మారింది. దీంతో యాసంగిలోనూ వరి పంటకు అదనులో యూరియా అందించడం కష్టసాధ్యంగా మారింది. పాత పద్ధతిలోనే యూరియా ఇవ్వాలంటూ పలు జిల్లాల్లో అన్నదాతలు రోడ్డెక్కుతున్న పరిస్థితి నెలకొంది. యాప్‌లో కొన్నిషాపుల్లో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని చూపిస్తుండడంతో రైతులు ఆ షాపును ఎంచుకుంటున్నారు. తీరా అక్కడికి వెళితే స్టాక్



లేదని, యాప్‌లో లోపాలవల్ల తప్పుడుగా చూపిస్తుందని షాప్ యజమానులు చెబుతుండడంతో రైతులు తీవ్ర నిరాశతో వెనుతిరుగుతున్నారు. డీలర్లు స్టాక్‌ఎంత ఉందో యాప్‌లో అప్‌డేట్ చేయకపోవడంతో ఈసమస్య తలెత్తుతుందని వ్యవసాయ అధికారులను చేతులు దులుపుకుంటుండడంతో రైతుల సమస్య పరిష్కారం కాని పరిస్థితి నెలకొంది. యూరియా కోసం యాప్‌లో నమోదు చేసుకోవాలని నిబంధన పెట్టడంతో చదువురాని రైతులు, పేదరైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా యాప్ కోసం అప్పు చేసి స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం తాడికల్‌లో జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకోకు దిగారు. యూరియాలోటు, యాప్ బుకింగ్ సిస్టమ్‌తో విసిగిపోయిన రైతులు గోదాం నుంచి నేరుగా జాతీయ రహదారిపైకి వచ్చి రాస్తారోకోకు దిగారు. ఇలా యాప్ విధానంతో చదువురాని, ఆండ్రాయిడ్ ఫోన్లులేని, ఆపరేటింగ్ రాని రైతులు అరిగోస పడుతున్నారు. వరి పైర్లు కీలక దశలో ఉన్న సమయంలో యూరియా అందక పంట దిగుబడి కోల్పోయే పరిస్థితి నెలకొంది. కరీంనగర్ జిల్లా మాదిరిగానే యాసంగిలో ఇతర జిల్లాల రైతులూ యూరియా కోసంఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో యాప్ ద్వారా యూరియా పంపిణీని నిలిపివేసి సరిపడా యూరియా బస్తాలు అందుబాటులో ఉంచి,పాతపద్ధతిలో సరఫరా చేయాలని డిమాండ్ రైతుల నుంచి వినిపిస్తోంది. ఈ 2025-26 ఖరీఫ్‌లో రైతులు పడ్డయూరియా కష్టాలు అన్నీఇన్నీ కావు. రాత్రింబవళ్లు యూరియా కోసం అన్నదాతలు పడిగాపులుగాశారు. నిద్రాహారాలు మాని ఇంటిల్లిపాది అందరూ క్యూలైన్లలో పడిగాపులుగాసినా పంటకు సరిపడినంత యూరియా దొరక్క అవస్థలుపడ్డారు. ఒకటి, రెండుచోట్ల యూరియా కోసం పడిగాపులు గాసే క్రమంలో అన్నదాతలుతీవ్ర అస్వస్థతకు గురై క్యూలైన్లలోనే కుప్పకూలిపోయిన ఘటనలూ చోటు చేసుకున్నాయి. వరి, పత్తి పంటకు సరైన సమయంలో యూరియా వేయకపోవడంతో ఆశించినస్థాయిలో దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయారు. సాధారణంగా వరికి ఎకరాకు మూడు బస్తాల యూరియాను చల్లాలి. కానీ ఖరీఫ్ ఆసాంతం ఒక్కో రైతుకు కనీసం రెండు బస్తాల యూరియా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. దొరికినా ఆ యూరియా కూడా అదను దాటిపోయాక చేతికందడం, పంటకు చల్లడంతో దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఇక వరి తర్వాత పత్తి సాగు చేసిన రైతులు ఈఏడాది కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పెట్టిన నూతన నిబంధనలతో తీవ్రంగా నష్టపోయారు. తేమ 8 శాతానికి మించకూడదని, కిసాన్ కపాస్ యాప్ ద్వారా బుక్ చేసుకుంటేనే సదరు రైతు పత్తిని కొనుగోలు చేస్తామని, అది కూడా ఎకరాకు 7క్వింటాళ్లు మాత్రమేనని కొత్త కొత్త కొర్రీలు పెట్టడంతో అన్నదాతలు అనివార్య పరిస్థితుల్లో ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకోవాల్సిన వచ్చింది. ఎకరానికి అనుమతించే పత్తి దిగుబడిని 12 క్వింటాళ్ల నుంచి 7 క్వింటాళ్లకు తగ్గించడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈనిర్ణయం రైతులపాలిట అశనిపాతంలా మారింది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులపై తీవ్ర ప్రభావం చూపింది. కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ. 8111ను మద్దతు ధరగా నిర్ణయించగా తెలంగాణ రైతులు క్వింటాల్‌కు రూ. 6వేలకే అమ్మాల్సి వచ్చింది. మరి 2026-27 ఖరీఫ్ సీజన్‌లోనైనా సీసీఐ రైతులకు ఇబ్బందులు ఎదురుకాకుండా పత్తి కొనుగోళ్లను చేపడుతుందా? అన్నది ప్రశ్నార్థకంగానే మారింది. విత్తనం విత్తే సమయం నుండి పంట కోత కోసి మార్కెట్‌కు తరలించే వరకు రైతులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. సాగు గిట్టుబాటు కాకపోవడంతో వ్యవసాయం చేసే వారి సంఖ్య రోజు రోజుకూ తగ్గిపోతోందని వ్యవసాయరంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రైతు కుటుంబాల్లో తర్వాతి తరం వారు వ్యవసాయానికి దూరంకావాల్సిన అనివార్య పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు రైతులను మరింత ప్రోత్సహించే విధానాలు అమలు చేయకపోతే రానున్న రోజుల్లో సాగు సంక్షోభం తలెత్తే ప్రమాదం పొంచిఉంది.వ్యవసాయానికి కావాల్సిన పెట్టుబడులు ప్రభుత్వరంగ సంస్థల నుంచి సకాలంలో అందడం లేదు. పరిశ్రమలకు కావాల్సిన ప్రోత్సాహకాలు,సబ్సిడీలు అందిస్తున్న ప్రభుత్వాలు అదే సాగు విషయానికి వచ్చే సరికి పంటలకు కావాల్సిన ఆర్థిక వనరులు, సాంకేతిక సాయాన్ని రైతులకు అందుబాటులోఉంచడం లేదు. దీంతో యువత వ్యవసాయానికి దూరం కావాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వాల నుంచి పంట గిట్టుబాటు ధరకుహామీ లేకపోవడం, నూతన సాంకేతిక సాగు పద్ధతులను పరిచయం చేయకపోవడంతో నేటి తరం యువత వ్యవసాయానికి క్రమక్రమంగా దూరమవుతోంది. పండించిన పంటలకు గిట్టుబాటుధర రాకపోవడంతో సాగుకుతెచ్చిన అప్పులు తీర్చలేక అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. దీంతో ఆ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈనేపథ్యంలో రైతులకు మద్దతు ధర, గిట్టుబాటు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. ●

# 'మహా' వ్యూహం!

మహారాష్ట్ర

**ఎ.వి.వి ప్రసాద్**

కొన్ని అనుకోని సంఘటనలు అనేక అనూహ్య పరిణామాలకు దారితీస్తుంటాయి. రాజకీయ సమీకరణలు కూడా మారిపోతూంటాయి. మహారాష్ట్రలో ఇప్పుడు కనిపిస్తున్న దృశ్యం అదే. డిప్యూటీ సిఎంగా ఉన్న అజిత్ పవార్ ఇటీవల విమాన ప్రమాదంలో మరణించిన తర్వాత ఆయన ఎన్సీపీ గ్రూపులో సంభవిస్తున్న పరిణామాలు మహారాష్ట్ర భవిష్యత్ రాజకీయ చిత్రానికి ఒక సంకేతమనే చెప్పాలి. మూడు సంవత్సరాల క్రితం అజిత్ ఎన్సీపి బిజెపి నాయకత్వంలోని 'మహాయుతి'లో చేరినా ఆయన బిజెపిలో 'స్థానికేతరుడు' స్థానంలోనే కనిపించారు. శరద్ పవార్‌ను రాజకీయంగా బలహీనపరచాలనే ఏకైక లక్ష్యంతో అజిత్ ఎన్సీపీకి బిజెపి 'ఆశ్రయం' కల్పించిందనే అప్పట్లో చెప్పుకొన్నారు. శరద్ ఎన్సీపీని మహారాష్ట్రలో లేకుండా చేయాలనే ప్రయత్నాలు చాలా జరిగాయి. ఎన్సిపీలో చీలిక రావడానికి కారణం ఎవరైనా, అజిత్ గ్రూపు మహాయుతిలోకి రావడానికి ప్రధాన కారణం ఫడ్నవీస్ అనే చెప్పాలి. అయితే అజిత్ ఎన్సీపీకి తొలుత లభించిన ప్రాధాన్యం తరువాత కొంత తగ్గినట్లు కనిపించింది. ఆ సమయంలోనే అజిత్ తిరిగి తన బాబాయ్ శరద్‌పవార్ వైపు జరగడం మొదలు పెట్టారు.జనవరిలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో ఈ పరిణామం స్పష్టంగా కనిపించింది. ఒక మరాఠా నేత పార్టీలో ఉంటేనే ఆ వర్గం ఓట్లు తేలికగా లభిస్తాయనే ఆశతో బిజెపిఅప్పట్లో అజిత్‌కు మహాయుతిలో చోటిచ్చింది. అప్పటికే అజిత్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉండడంతో ఆయన బిజెపి కూటమిలోకి రావడం ప్రధానికి ఇష్టంలేదనీ, అయినా ఫడ్నవీస్ ఒత్తిడితో అంగీకరించారనీ అనుకొన్నారు. శివసేనలో చీలిక తెచ్చి మహాయుతిలోకి వచ్చిన ఏక్‌నాథ్ షిండేపై కూడా బిజెపికి తగినంత 'నమ్మకం' లేదనే చెప్పాలి. మహారాష్ట్రలో అత్యంత శక్తిమంతుడైన నేతగా శరద్‌పవార్‌కు ఉన్న పేరు పలుచబడడానికి అటు బిజెపి ఎంత కారణమో, ఇటు అజిత్ కూడా అంతే కారణం. బిజెపితో సాన్నిహిత్యం పెరిగిన తరువాత శరద్‌ను బలహీ నపరిచే ప్రయత్నం చేసిన అజిత్ తర్వాత పొర బాటును తెలుసుకొన్నారో ఏమో! తిరిగి శరద్ తో పొత్తుకు ప్రయత్నించారు షిండే శివసేనలోకి, అజిత్ తిరిగి ఎన్సీపీలోకి వెళ్తే అధికార కూటమి బలహీనపడుతుందిగనుక, ఆ ప్రమాదం రాకుండా ఫడ్నవీస్ చక్రం తిప్పారు. అజిత్ మరణానికిముందు విలీనయత్నాలుఒకందుకు జరిగితే, అదే ఇప్పుడు మరొకందుకు జరుగుతున్నాయి. అజిత్, శరద్ ఎన్సీపీలు కొద్ది రోజుల్లో విలీనం కాబోతున్నాయనే వార్తలు వ్యాపిస్తున్న సమ యంలో అజిత్‌హఠాత్తుగా విమాన ప్రమాదంలో మరణించారు. ఆ ఘటన నిజంగానే ఫడ్నవీస్‌కు చెమటలు పట్టించింది. శరద్ కంటే ముందే చక్రం తిప్పారు. వ్యూహ నిపుణుడైన ఫడ్నవీస్ తక్షణమే రంగంలోకి దిగి చకచకా పావులు కదిపారు. సంతాప దినాలు కూడా ముగియకుండానే, రెండో రోజునే అజిత్ సతీమణి సునేత్రతో చర్చలు జరిపి డిప్యూటీ సీఎం పదవి స్వీకరించడానికి ఒప్పించారు. ఈ పరిణామం శరద్ పవార్‌కు,ఆయన కుమార్తె సుప్రియా సూలేకు తెలియకుండానే జరిగిపో యింది. సునేత్ర పదవీ స్వీకారం రోజున కొందరు మీడియా ప్రతినిధులు శరద్‌పవార్‌ను ఆ విషయంపై ప్రశ్నిస్తే 'నాకేం తెలీదు, వారిష్టం వారిది' అన్నట్లు మాట్లాడారు. ఆతర్వాత మనశ్శాంతి లేకనో, ఇతర అనారోగ్య కారణాల వల్లనో శరద్ పవార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అజిత్ ఉన్నప్పుడు ఒక కారణంతో విలీనమవ్వా లనుకొంటే,అదే విలీనాన్ని జరిపించి తనకు అను కూలంగా మలచుకోవాలనిఫడ్నవీస్ ఇప్పుడు భావిస్తున్నారు. విలీనం జరగకూడదనే ఉద్దేశం తోనే సునేత్రకు వెంటనే పదవి ఇచ్చి, ఎన్సీపీ మంత్రులను మార్చకుండా కొనసాగిస్తున్నారు. కానీ గత రెండుమూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే



ఫడ్నవీస్

విలీనాన్ని ఫడ్నవీస్ ప్రోత్సహిస్తున్నట్లుగా కనిపిస్తుంది. శరద పవార్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో, ఆయన వర్గం ఎన్సీపీని కూడా అజిత్ వర్గంలో విలీనం చేస్తే మొత్తం ఎన్సీపీ తమ అధీనంలోకి వస్తుందన్నది బిజెపి వ్యూహంగా కనిపిస్తోంది. 2024ఎన్నికల్లో అజిత్ ఎన్సీపీకి 9శాతం ఓట్లురాగా, శరద్ వర్గాని కి 11శాతం ఓట్లువచ్చాయి. అయితే సీట్లుమాత్రం అజిత్‌కే ఎక్కువ. ఆయన ఎన్సీపీకి 41 సీట్లు రాగా, శరద్‌వర్గానికి 10సీట్లు మాత్రమేవచ్చాయి. అంటే రెండు గ్రూపులు కలిస్తే దాదాపు 20 శాతం ఓట్లు, 50 పైగా సీట్లు తమ'కంట్రోల్ ' లోకి వస్తాయన్నది బిజెపి ఆలోచన. అందుకే కాబోలు సుప్రియా సూలేతో ఫడ్నవీస్ దూతలు గతవారం రెండు దఫాలుగా చర్చలు జరిపారనీ, ఈ విలీన యత్నాలకు సునేత్ర కూడా సుముఖంగానే ఉన్నారనీ అంటున్నారు. అజిత్ పెద్ద కుమారుడైన పార్థ్‌ను కూడా ఫడ్నవీస్ ఇప్పటికే ఒప్పించినట్లు తెలుస్తోంది. సునేత్ర, పార్థ్ గతవారం అమిత్ షాతో జరిపిన భేటీలో ఈ విషయాలే ప్రధానంగా చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. శరద్ పవార్ కంటే ఇప్పుడు సూలే ముఖ్యం గనుక ఆమెను కూడా విలీనానికి ఒప్పించినట్లుగా తెలుస్తోంది. విలీనం జరగగానే ఎన్సీపీకి కేంద్రంలో రెండు మంత్రి పదవులు లభించగలవనీ, ప్రఫుల్ పటేల్, సుప్రియకు కేంద్ర కేబినెట్ పదవులు లభిస్తాయనీ అంటున్నారు. అలాగే శరద్ వర్గం నుంచి మహారాష్ట్ర కేబినెట్‌లోకి కూడా ఇద్దరికి చోటు లభించగలదని తెలుస్తోంది. 35శాతం ఉన్న మరాఠా ఓటుబ్యాంకు తమవైపు ఉండాలంటే ఇదేమార్గమని బిజెపి అధిష్ఠానం భావిస్తోంది. కాంగ్రెస్ గాని, శివసేన గాని తిరిగి తలెత్తకుండా ఉండాలంటే ఇదొక్కటే సరైన చర్యగా బిజెపి భావిస్తున్నదనీ, అందుకే ఎన్సీపీ వర్గాల విలీనానికి ఫడ్నవీస్ స్వయంగా నడుం కట్టారనీ చెబుతున్నారు. ఒకప్పుడు ఎన్సీపీలో చీలికకు కారణమైన బిజెపి ఇప్పుడు ఆ రెండు వర్గాల విలీనానికి పావులు కదుపుతున్నదంటే రాజకీయ వ్యూహాలు ఎంత విచిత్రమో! అనిపిస్తుంది. ●

# డార్క్ ప్రిన్స్‌కే పట్టం!

బంగ్లాదేశ్

**గన్ని మోహన్**

ప్రపంచదేశాలన్నింటా అత్యంత ఉత్కంఠ భరితంగా చర్చలు సాగిన బంగ్లాదేశ్ ఎన్నికల్లో మొత్తం రూపురేఖలు మారాయి. అంచనాలకు ఏమాత్రం భిన్నం కాకుండా దివంగత ప్రధాని ఖలీదాజియా కుమారుడు తారిక్ అన్వర్ నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ విజయఢంకా మోగించింది. మొత్తం 299స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 209 స్థానాలు గెలిచిన బిఎన్పీతోపాటు పాక్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న జమాత్ ఇ ఇస్లామీకి 68స్థానాలు లభించాయి. ఇక హసీనాను గద్దెదించేందుకు ఉద్యమం నడిపి పోరుబాటకు శ్రీకారం చుట్టిన నేషనల్ సిటిజన్ పార్టీ ఎన్సీపీ కేవలం ఆరుస్థానాలకే పరిమితమైంది. ఆ పార్టీని ప్రజలు ఎంతమాత్రం విశ్వసించకపోవడానికి ముస్లిం మూలాలతో పాకిస్థాన్‌లో సన్నిహిత సంబంధాలు నెరపిన జమాతే పార్టీతో పొత్తులతో పోటీకి దిగడమే ఆపార్టీకి శాపంగా మారిందని చెప్పాలి. బంగ్లాదేశ్ చరిత్రలో 35 ఏళ్ల తర్వాత తొలిసారి ఒక పురుష నాయకుడు ప్రధాని పదవిని అధిష్టిస్తున్నారు. అదికూడా దివంగత ప్రధాని ఖలీదాజియా కుమారుడు కావడం విశేషం. 2001లో మాత్రమే అధికారంలోకి వచ్చిన బిఎన్‌పి 2006 తర్వాత ఏర్పడిన రాజకీయపరిణామాలు, తిరుగుబాట్లతో నలిగిపోయింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో అవామీలీగ్ ప్రభుత్వమే పాలనచేపట్టింది. సుమారు 17 ఏళ్లపాటు ప్రవాసంలో గడిపిన తారిక్ రెహమాన్ ఎట్టకేలకు తనచిరకాలస్వప్నం నెరవేర్చుకున్నారు. అయితే భారత్‌పై ఆయన అనుసరించే వైఖరిపైనే ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీస్తోంది. తారిక్ పార్టీ ఎన్నికైన వెంటనే భారత ప్రధాని నరేంద్రమోడీ కూడా ఆయనకు స్వయంగా ఫోన్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇరుదేశాల పరస్పర సహకారంతో ముందుకు పోవాలని ఆకాంక్షిస్తున్నట్లు కూడా చెప్పారు. మహ్మద్ యూనస్ కేర్‌టేకర్‌గా పగ్గాలు చేపట్టిన ప్పటినుంచి భారత్‌పట్ల బంగ్లాదేశ్‌లో వ్యతిరేకత పెరుగుతూ వచ్చింది. విముక్తి పోరాటంలో బంగ్లాను వెన్నంటినడిచి యుద్ధంచేసి ప్రత్యేక దేశంగా ఆవిర్భవించేందుకు సహకరించిన భారత్‌ను యూనస్ సర్కారు ఇప్పుడు గడ్డిపోచతో సమానం అన్నట్లుగా చూస్తోంది. అంతేకాకుండా శత్రుదేశమైన పాక్‌తో సాన్నిహిత్యానికి తహతహలాడింది. ఈవిపత్కర పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌లోని హిందూమైనార్టీలో అల్లాడిపోయారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవనం గడుపుతున్నారు. అయినా కూడా 11మందివరకూ మతముష్కరుల చేతుల్లో బలైపోయారు. ఈపరిస్థితుల్లో బంగ్లాదేశ్ ప్రధాని కాబోతున్న బిఎన్పీనేత తారిక్ వైఖరి, ఆయన అనుసరించే విదేశాంగ విధానాలపైనే ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది. పరస్పరం గౌరవించుకునే విధానాన్నే తాము గౌరవిస్తామని భారత్‌తో కొన్ని సమస్యలు కూడా ఉన్నాయని, పరస్పర అవగాహన ముఖ్యమని తారిక్ వ్యాఖ్యలు చేసారు. షేక్ హసీనాకు ఆశ్రయం కల్పించినందువల్ల భారత్‌ను విభేదిస్తారా అన్న ప్రశ్నలపై స్పందించిన తారిక్ అది భారత్‌పైనే ఆధారపడి ఉంటుందన్నారు. ఎన్నికల్లో బిఎన్పీ విజయం ప్రజాస్వామ్య విజయం అని అభివర్ణించిన కాబోయే ప్రధాని ప్రజాస్వామ్యంకోసం ప్రాణత్యాగం చేసిన అందరికీ ఈ విజయం అంకితం చేస్తున్నానంటూ ప్రకటించి ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించారు. హసీనాకాలంలో ఎంతో సాన్నిహిత్యంతో మెలిగిన భారత్‌తో తారిక్ ఇప్పుడు తన పార్టీ తరపున ప్రభుత్వం సన్నిహిత బాంధవ్యం కోరుకుంటారా అన్నది సందేహాస్పదమే. 2024 ఆగస్టు నుంచి మరింతగా సంబంధాలు క్షీణించడానికి గలకారణం మహ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వం అనుసరించిన విధానాలేనని చెప్పాలి. చైనాకు దగ్గరయ్యేందుకు తహతహలాడిపోవడం, ఈశాన్య రాష్ట్రాలపై అసంబంధ వ్యాఖ్యలు చేయడం, చైనాకు సానుకూలమైన మాటలతో దగ్గరయ్యేందుకు ప్రయత్నించడం వంటివి జరిగాయి. ఈ తరుణంలో భారత్‌కూడా ఎంత మాత్రం తీసిపోకుండా భారత్ సార్వభౌమత్వంపై కుట్రలు, దాడులు చేస్తే చూస్తూ కూర్చోదని గుణపాఠం ముందెన్నడూ చవిచూడనంత స్థాయిలో ఉంటుందని కూడా హెచ్చరించింది. ఈ పరిస్థితులు ఇలా ఉంటే తాజాగాజరిగిన ఎన్నికల్లో ఏకైక అతిపెద్దపార్టీగా అవతరించిన బిఎన్పీకి గతంలో నియంతపాలన చేసిందన్న మచ్చకూడా లేకపోలేదు. డార్క్‌ప్రిన్స్‌గా తారిక్‌ను పిలిచిన ఆకాలంలో బిఎన్పీ, జమాతే ఇస్లామితో కలిసి సంకీర్ణ ప్రభుత్వం నడిపారు. హవాభబన్ అనే రెండంతస్తుల భవనం నుంచే ఆనాడు యువరాజుగా రహమాన్ సమాంతర పాలన కూడా నిర్వహించారు. ఒకవిధంగా ఈ భవనాన్ని షాడో పిఎంఒ అని పిలిచేవారు. అటు తర్వాత 2008లోజరిగిన ఎన్నికల్లో తిరిగి ఆవామీలీగ్ రావడం ఆపై రెండేళ్ల క్రితంనుంచి రాజుకున్న ఉద్యమంలో హసీనా గద్దెదిగి భారత్‌లో ఆశ్రయం పొందుతుండటం జరిగిపోయాయి. యూనస్ కాలంలోనే తారిక్‌పై నమోదైన అన్ని కేసులను రద్దుచేసి ఆయనకు శిక్షలనుంచి మినహాయింపు ఇవ్వడంతో లండన్ నుంచి తిరిగొచ్చిన తారిక్ తనదైన శైలిని ప్రదర్శించారు. పార్టీలో అంచలంచెలుగానే ఎదిగిన తారిక్ పార్టీచీఫ్‌గా ఎంపికయినప్పటి నుంచి పార్టీని అధికారంలోకి తీసుకువచ్చే లక్ష్యంతోనే పనిచేసి విజయవంతం అయ్యారు. పార్టీల విజయాలు మారుతుంటాయి. ప్రభుత్వాలు మారుతుంటాయి, పాలకులు సైతం మారుతూనే ఉంటారు. మార్పుకోరే ప్రజలు విచక్షణతో వారిని ఎన్నుకుంటే ఎలాంటి గండాలు ఉండబోవు. కానీ ఇపుడు ఒకప్పుడు డార్క్ ప్రిన్స్‌గా వ్యవహరించిన తారిఖ్ మళ్లీ జమాతే ఇస్లామితో దోస్తీ కడతారా? లేక ఏకైక అతిపెద్ద పార్టీగానే అవతరించి బంగ్లాను శాసించగలుగుతారా అన్నది కాలమే నిర్ణయించాలి. అయితే డార్క్‌ప్రిన్స్ మచ్చ తొలగించుకోడానికి పగ్గాలు చేపట్టిన మరుసటి రోజునుంచే శ్రమించాలి. లేకుండా మళ్లీ లండన్ జీవితాన్ని తారిక్ గుర్తుకు తెచ్చుకోవాల్సి ఉంటుంది. ●



తారిక్ రెహమాన్

# మెడికల్ మాఫియా మోసాలకు అడ్డుకట్ట వేయలేరా?

**పిల్లా తిరుపతిరావు**

అనాదిగా భారతదేశంలో ఆయుర్వేద వైద్యం ఉంది. అలనాటి వైద్యులు మొక్కలు, మూలికలు, ఖనిజాలు, జంతు ఉత్పత్తుల చూర్ణాలతో ఔషధాలు తయారుచేసి, వివిధ రోగాలను నయం చేసేవారు. ఇది సాంప్రదాయవైద్య చికిత్సా విధానం. ఐతే ఈ వైద్యవిధానాన్ని ఎందరో మహనీయులు వర్గబేధాలకు అతీతంగా సేవయే పరమార్థంగా భావిస్తూ, ఉచితంగానే ప్రజలకు అందించారు. విశ్వంలో అప్పుడప్పుడు అనేక విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి. ఈ అనూహ్య వాతావరణ మార్పుల ఫలితంగానే మానవ జీవన పరిణామ క్రమంలో అనేక మొండిరోగాలు ప్రబలినాయి. వీటికి విరుగుడు దొరకని పక్షంలో ఆధునిక వైద్యం ప్రత్యామ్నాయంగా నిలిచింది. ఇదే అల్లోపతీ వైద్యం. ఇది మానవుని ఆయుః ప్రమాణాన్ని పెంచింది. ఈ అల్లోపతీ ఔషధాల తయారీలో శాస్త్రవేత్తల కృషి ఎనలేనిది. వారు తమ ఆస్తులను, జీవితాలను, చివరికి ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అహర్నిశలూ పరిశోధనలు జరిపారు. తద్వారా సమాజ సంక్షేమం కాంక్షించి ఎన్నో ఇంగ్లీష్ మందులను లోకం ముందుంచారు. ఈ క్రమంలోనే అనేక మొండిరోగాలను నిరోధించే యాంటీబయాటిక్స్ వెలుగు చూశాయి. 1928లో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ పెన్సిలిన్ మందును కనుక్కున్నారు. ఇది వైద్యరంగంలో విప్లవాత్మకమైన సందర్భం. ఇది మానవ జీవన గమనాన్నే మార్చివేసింది. అంతవరకు అనేక ప్రాణాంతక రోగాలతో సతమతమవుతున్న మానవుని ఉనికికి గొప్ప భరోసానిచ్చింది. సాంప్రదాయ ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య విధానాలకు భిన్నమైనది అల్లోపతీ వైద్యం. పూర్తిగా శాస్త్రీయమైనది. రోగనిర్ధారణ,చికిత్సలలో ప్రామాణికత ఉంటుంది. ఐతే ఈ వైద్యంలో సైడ్‌ఎఫెక్ట్స్ కూడా ఎక్కువే. రోగి ఇళ్లూ, ఒళ్లూ రెండూ గుల్లైపోతాయి. కాకపోతే తక్షణం ఉపశమనాన్నిచ్చే అద్భుతమైన వైద్యమిది. కాబట్టి జనం ఈ రకమైన చికిత్సకే మొగ్గుచూపుతారు. భౌగోళికంగా విభిన్న శీతోష్ణస్థితులు కలిగిన భారత దేశంలో ప్రజల జీవన విధానాలు వేరువేరుగా ఉంటాయి. వివిధ ప్రాంతాల వారీగా నివసిస్తున్న ప్రజల ఆహారవిహారాదులలో అనేక వైవిధ్యాలు చోటుచేసుకుంటాయి. అందువల్ల ఇక్కడ జనం రకరకాల రోగాలతో బాధపడడం చూస్తాం. ఇంకా ఇక్కడి ప్రజల్లో హెచ్చుశాతం పేద, మధ్యతరగతి వర్గాల వారే ఉన్నారు. వీరి ఆర్థిక పరిస్థితిని బట్టిచూస్తే శుభ్రమైన గాలి, పరిశుభ్రమైన నీరు, సమతుల్య ఆహారం లభించడం కష్టం. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న జనం పౌష్టికాహార లోపంతో ఉండడం సహజమే. ఈ లేమితనమే అనేక వ్యాధుల సంక్రమణకు మరొక కారణం. ఆర్థిక వెనుకబాటుతో ఉన్న నేటి సమాజంలో దేశీయ అల్లోపతీ వైద్యవిధానం జనాన్ని మరింత బెంబేలెత్తిస్తున్నది. గ్రామస్థాయి వైద్యుల నుంచి కార్పొరేట్ స్థాయి వైద్యుల వరకు ప్రజల్ని మోసగిస్తున్నారు. వైద్యవిధానమే ఏకంగా వ్యాపారాత్మకమైంది. లాభం పేరిట కాసులను ఏరుకోవడమే ప్రథమ కర్తవ్యమైంది. ఒకప్పటి సేవాదృక్పథం నేడు కొరవడింది. వైద్యులు, ఆసుపత్రి నిర్వాహకులు, మందులు తయారీ కంపెనీలు, మందుల అమ్మకందారులు, మెడికల్ సామాగ్రి తయారీదారులు, రోగ నిర్ధారిత పరీక్షా కేంద్రాల నిర్వాహకులు మెడికల్ మాఫియాగా తయారై ప్రజల్ని పీడించుకు తింటున్నారు. ఐతే ప్రభుత్వాలు దారిద్ర్యరేఖ దిగువనున్న ప్రజలకు పలు వ్యాధుల చికిత్సకై ఉచిత ఆరోగ్యసేవలను అందిస్తున్నాయి. ఐనప్పటికీ పరువుప్రతిష్టల అంశంగా భావిస్తూ, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పి టల్స్‌లోనే ప్రజలు వైద్యం చేయించుకుంటున్నారు. కార్పొ రేట్ హాస్పిటల్స్ నిర్వహణ ఉన్నతంగా ఉంటుంది. శుభ్రతా ప్రమాణాలు పాటిస్తారు. అందువల్లనే కార్పొరేట్ హాస్పిటల్ పట్ల ప్రజల ఆసక్తి చూపుతారు. ఐతే దీన్ని బలహీనతగా చూసి ఆయా యాజమాన్యాలు రోగులనుండి హెచ్చుమొత్తం లో డబ్బులు గుంజేస్తున్నారు. దోచుకున్నోడికి దోచుకున్నం త అన్న చందంగా తయారైంది ప్రైవేటుకార్పొరేట్ వైద్య లోకం. ఈ రంగం హాస్పిటల్లో డాక్టర్ ఫీజుతో పాటు, రోగ నిర్ధారణ పరీక్షల ఖర్చు, మందుల అమ్మకపు ధరలు అధి కంగా





ఉంటాయి. డాక్టర్ రాసే మందులను రోగులు కొనేట ప్పుడు మందుల షాపులవారు నాసిరకం మందులను కొన్ని అంటగడుతుంటారు. వీరికి ఈరకం మందుల్లో వచ్చేమార్జిన్ ఎక్కువ. ఉదా: పావలా ధర గల మందును రూపాయి ధరకు అమ్ముతారు. పైగా హాస్పిటల్ మందుల షాపుల్లో మందులు కొనుగోలుకు ఎటువంటి రాయితీ ఇవ్వరు. ఇవే మందులు బయట మందుల షాపులో కొంటే ఎంతో కొంత శాతం తగ్గింపు ఉంటుంది. ఇంకా రోగనిర్ధారణ పరీక్షల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఈ నిర్ధారణ పరీక్షల్లో నిర్దిష్ట ప్రమాణాలు పాటించరు. ప్రామాణికమైన వస్తుసామగ్రిని వినియోగించరు. వివిధ స్కోపీలు, అల్ట్రాసౌండ్, సిటీ, ఎం.ఆర్.ఐ స్కాన్ పరీక్షలకు పెట్టే ఖర్చు అంతేలేకుండా పోతున్నది. మోసానికి ఒడిగట్టడంలో మెడికల్ మాఫియాకి మించినది లేదు. డాక్టర్స్ అయితే అవసరమున్నా, లేకపోయినా ఎక్కువ వ్యాధి నిర్ధారిత పరీక్షలు రాయడం రివాజయ్యింది. హిస్టాక్టమీ ఆపరేషన్ అవసరం లేకపోయినా చేస్తుండడం చూస్తున్నాం. ఐతే ఈరకమైన చర్యలన్నింటిలోనూ డాక్టర్స్‌కు రావలసిన కమిషన్లు వచ్చిపడతాయి. అలాగని అందరు డాక్టర్లనీ ఒక గాటన కట్టలేం. 'వైద్యో నారా యణో హరి'అని అంటాం. వైద్యులు ప్రాణదాతలు. సేవా దృక్పథంతో పనిచేసేవారు లేకపోలేదు. ఐతే వీరిలో అతి కొద్దిమంది మాత్రమే పేదారోదా అనే భావనతో వైద్యం చేయడంచూస్తాం. గతంలో ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ వ్యాధి విజృంభించింది. అది కోట్ల మంది ప్రజలను బలితీసు కుంది. ఆ సమయంలో వైద్యులు ప్రాణాలుపణంగా పెట్టి విధులు నిర్వర్తించారు. వారి త్యాగం మరువలేనిది. ఐతే దీన్ని అదనుగా చేసుకొని కార్పొరేట్లు కోట్లకు పడగలెత్తారు. ఆసుపత్రుల నిర్వహణ, మందులు సామగ్రి తయారీ,అమ్మకపు రంగాలలో ఇష్టానుసారంగా ధరలు పెంచి డబ్బులు దోచేశారు. ఉదా: రెండు రూపాయలకు తయారయ్యే మాస్క్‌లకు ఐదారురెట్లు రేట్లు పెంచేశారు. ఇదేపరిస్థితి శానిటైజర్లు, మందుల అమ్మకాలలో కూడా ఉంది. హాస్పిటల్స్‌లో బెడ్స్, ఆక్సిజన్ సిలిండర్స్, కాన్సెంట్రేటర్స్‌కు కృత్రిమ కొరత సృష్టించి విపరీతంగా సొమ్ము చేసుకున్నారు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటివి జరుగకుండా కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వహణపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం నిఘా పెంచాలి. సక్రమంగా నిర్వహించని ఆసుపత్రుల అనుమతులు రద్దుచేయాలి. నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలతో ఆటలాడుకుంటున్న యాజమాన్యాలను శిక్షించాలి. తద్వారా కార్పొరేట్ వైద్యరంగాన్ని ప్రక్షాళన చేయాలి.నేడు ప్రభుత్వ వైద్యమంటే చులకన భావంతో చూసే ప్రజలున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ బాగానేఉంది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఆసుపత్రులలో అధునాతన వైద్య సదుపాయాలున్నాయి. అక్కడ క్రిటికల్ కేర్ ఆపరేషన్స్, ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్స్ జరుగుతున్నాయి. ఐతే గ్రామస్థాయి ప్రభుత్వ వైద్యం ఈ స్థాయిలోనైతే లేదు. ఇది మరింత సమర్థవంతంగా అందాల్సివుంది. క్షేత్రస్థాయిలో వైద్య నిపుణులు కొరతుంది. దీనికి కారణం లేకపోలేదు. వైద్యవిద్య చదివినవారు ప్రభుత్వ వైద్యునిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించడానికి ఇష్టపడటం లేదు. ప్రభుత్వ వైద్యునిగా ఉద్యోగాలు చేసేవారికి మరిన్ని ఆర్థికపరమైన సౌలభ్యాలు కల్పించి వృత్తి పట్ల ఆకర్షణ పెంచాల్సిన బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలి. నర్సెస్ హెల్త్ స్టాఫ్ భర్తీని చాలినంత చేయాలి. అప్పుడే ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ మరింత బలోపేతమోతుంది. డాక్టర్ పేషెంట్ రేషియో సగటున 1:1000 ఉండాలంటారు. 2025 నాటికి భారతదేశంలో ప్రభుత్వప్రైవేటు వైద్యసేవలలో కలిపి చూస్తే డాక్టర్ పేషెంట్ రేషియో సగటున 1:811 ఉంది. ఈనిష్పత్తి గ్రామీణ, గిరిజన ప్రాంతాలలో ఉండదు. ఈనిష్పత్తి ప్రాప్తికి ప్రభుత్వ వైద్యమైతే అందదు. ఇండియాలో 2025 నాటికి ప్రభుత్వప్రైవేటు వైద్య సేవలను కలిపి చూస్తే ప్రతి1000మందికి 1.3బెడ్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ వైద్యరంగం అన్ని రాష్ట్రాల్లో ఒకేలా లేదు. అన్నిప్రాంతాలకు ఒకేలా అందటం లేదు. కొండమీద ఉన్న గిరిజనానికి ఇప్పటికీ సరైన వైద్య సదుపాయాల్లేవు. రహదారులు లేని గ్రామాలు ఇప్పటికీ ఉన్నాయి. వారు డోలీలు కట్టుకొని కొండ దిగాల్సిన పరిస్థితి ఉంది. వారిని పూర్తిస్థాయిలో ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. అంతేకాదు కార్పొరేట్ వైద్యానికి ధీటుగా ప్రభుత్వ వైద్యాన్ని ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరం కూడా ఉంది. ●

05ATP14_05ATP14.qxd 15-02-2026 AM 12:05 Page 1



# తిమ్మమ్మ మర్రిమా ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ

**- శివరాత్రి మహోత్సవం సందర్భంగా వి.వి.ఐ.పిల రాక - డ్రోన్, సిసి కెమెరాలతో పాటు నైట్ విజన్ డ్రోన్ కెమెరాలతో నిరంతరం నిఘా - లేపాక్షి, హేమావతి, తిమ్మమ్మ మర్రిమాను, కాటి కోటేశ్వర ఆలయాల వద్ద పోలీసులతో బందోబస్తు - జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్**

నంబులపూలకుంట, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మమ్మ మర్రిమాను ఆలయాన్ని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ శనివారం సందర్శించి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం శివరాత్రి మహోత్సవం పురస్కరించుకొని భద్రత ఏర్పాట్లకు సంబంధించి ఎస్పీ, కదిరి, డిఎస్పీ శివన్నారాయణ స్వామితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మూడు రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల కోసం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా భారికేడింగ్, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించి సూచనలు చేశారు. సాయంత్రం నుంచి భద్రత ఏర్పాట్లతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, అన్ని విభాగాలతో సమన్వయం చేసుకొని ఎటువంటి ఘటనలకు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశం చారు. సీసీ కెమెరాలు, డ్రోన్, నైట్ విజన్ డ్రోన్ల ద్వారా నిఘా ఉంచుతామన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఎస్పీ స్పష్టం చేశారు. అన్ని శివ క్షేత్రాలలో శివరాత్రి పండుగ సందర్భంగా పోలీస్ శాఖ భద్రతపరంగా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. జిల్లా ఎస్పీ వెంట కదిరి డిఎస్పీ శివన్నారాయణ స్వామి, సిఐలు నిరంజన్ రెడ్డి, నాగేంద్ర, ఎస్ఐలు, నరసింహులు, మక్బూల్ సుమతి, కృష్ణమూర్తి సిబ్బంది ఉన్నారు.



తిమ్మమ్మ మర్రిమాను ఉత్సవాలను పరిశీలిస్తున్న ఎస్పీ

# ముదిగుబ్బలో పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

ముదిగుబ్బ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త.

పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకుముదిగుబ్బలోకొవ్వొత్తులతోఘననివాళులుఅర్పించారు. బిజెపి జిల్లా కిషన్ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక మండలకేంద్రమైనముదిగుబ్బ బస్టాండ్ కూడలిలో శనివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అమరులైనజవాన్లచిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి రెండునిమిషాలుమౌనంపాటించారు. బిజెపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశభక్తి నినాదాలతో అమరవీరులను స్మరించారు. బిజెపి నాయకుడు సోమల ప్రకాష్ మాట్లాడుతూ దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన జవాన్ల త్యాగం ఎప్పటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఉగ్రవాదానికి తలగకుండాదేశభద్రత కోసం కేంద్ర ప్రభుత్వం కట్టుదిట్టమైనచర్యలు తీసుకుంటుందని తెలిపారు. అమరవీరులకు టుంబాల కుప్రగాఢసానుభూతి ని వ్యక్తం చేస్తూ వారి త్యాగం దేశ ప్ర జలకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమ ంద్వా రా యువత లోదేశభక్తిభావ నపెం పొందించాలని లక్ష్యంతో ర్యాలీ నిర్వహించామని వారు తెలిపారు ఈ కార్యక్రమంలోప సుపులేటి వెంకటేసు .నారాయణ. నాగభూ షణ. గంగులప్పా .శివకు మార్ కిషోర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు



నివాళులర్పిస్తున్నబిజెపినాయకులు

# పోలీస్ స్టేషన్ తనిఖీచేసిన డిఎస్పీ

**- రహదారిపై డ్రైనేజీ నీరువేయకుండా చర్యలు తీసుకోండి - డిఎస్పీ విజయ్‌కుమార్**

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త :

స్థానిక పోలీస్ స్టేషన్‌ను పుట్టపర్తి డిఎస్పీ విజయ్ కుమార్ శనివారం తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు, కేసుల పురోగతిపై ఎస్సై మల్లికార్జునరెడ్డితో ఆరా తీశారు. పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలని సూచించారు. పేకాట, బహిరంగ మద్యపానం, ఇతర అసాంఘిక శక్తులపై నిఘా ఉంచాలన్నారు. నాలుగు వరసల రహదారిపై ప్రమాదాలు జరగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు పెట్టించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సైకు సూచించారు. అనుమానాస్పద ప్రదేశాల్లో డ్రోన్ కెమరాతో బహిరంగ ప్రదేశాల్లో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. పలు మద్యం కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను తనిఖీ చేసి బహిరంగ వేలం వేసేందుకు వేగవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో డిఎస్పీ విజయ్ కుమార్, ఎస్సై మల్లికార్జు నరెడ్డి సిబ్బందితో కలసి విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. రహదారిపై మురుగు నీరు వేయకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సైకు సూచించారు. రోడ్డుపై అక్రమ ణలు తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఎఎస్సై నాగరాజు, కానిస్టేబుల్ నాగరాజు తోపా టు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్పీ

# కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త : మండలంలోని తిప్పేపల్లి తాండాలో శనివారం తెల్లవారుజామున గొర్రెల మందపై కుక్కలు దాడి చేయడంతో 35 గొర్రెలు మృతి చెందినట్లు బాధితుడు రామానాయక్ తెలి పారు. గొర్రెల మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నానని దాదాపు రూ 3 లక్షల వరకూ నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కన్నీటి పర్యంతమయ్యాడు. స్థానిక పశువైద్యాధికారి ప్రవీణ్ ఘటనా స్థలానికి వెళ్లి గొర్రెలను పరిశీలించారు. గాయపడ్డ గొర్రెలకు చికిత్సలు చేశారు. జడ్పీటిసి కుర్లి దామోదర్‌రెడ్డి, టిడిపి మండల పార్టీ కన్వీనర్ జయచంద్ర, ఓడిసి సింగిల్ విండో అధ్యక్షుడు తుమ్మల మహబూబ్‌బాష, మార్కెట్ యార్డ్ డైరక్టర్ నిజాంతో స్థానిక నాయకులు వెళ్లి రామా నాయక్‌ను పరామర్శించారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

# మెడికల్ మాఫియాను అరికట్టాలి - సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో నిరసన

కదిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కదిరిపట్టణంలో ప్రభుత్వ నిబంధనలను తుంగలోకి తొక్కుతున్న ప్రైవేట్ వైద్య శాలలపై కఠిన చర్యలుతీసుకుని మెడికల్‌మాఫియాను అరికట్టాలని సిపిఐ డివిజన్‌కార్యదర ఇశ నల్లజోడు పవన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కదిరప్పలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని వేమారెడ్డి సర్కిల్ కూడలిలో సిపిఐ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రుల దందా, మెడికల్ మాఫియా అరికట్టాలంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్ మాఫీయా ప్రజలు జీవించే హక్కుపై పరోక్ష దాడికొనసాగిస్తోందన్నారు. నాణ్యత లేని బోగస్ మందులు విచ్చల విడిగా మార్కెట్‌లు విక్రయించి వేలాది మంది ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. రాష్ట్రంలో మెడికల్ మాఫీయాపై ఉక్కుపాదం మోపేందుకై సిపిఐ పార్టీ పిలుపునిచ్చిందన్నారు. ప్రజల ఆరోగ్యం, వ్యాపారవస్తువుగా మారకూడదు, జీవించే హక్కు, రాజ్యాంగ బద్ద హక్కు, ఆ హక్కును కాలరాయడానికి ఎవరికీ అనుమతి లేదన్నారు. ఫార్మస్యూటికల్ కంపెనీలు, అధిక లాభాలకు ఆశపడి కార్పోరేట్ ఆసుపత్రులు వ్యాపార ధోరణ, పరీక్షల పేరుతో, రక్త పరీక్షల ల్యాబ్‌లు భారీ దందా చేస్తూ ర్పజలను ఆర్థికంగా, శారీరకంగా దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశాయి. అవసరం లేని టెస్టులు, అధిక దరలకు మందులు, నకిలీ ఔషధాల ఇవన్నీ కలిపి సాధారణ కుటుంబాలపై తీవ్ర భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనాన ప్రభుత్వ యంత్రాంగం నిద్రావస్త నుంచి మేల్కొని ప్రైవేట్ వ్యవస్థలో జరుగుతున్న దోపిడిని అరికట్టి మెడికల్ మాఫీయాపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లియాఖతలి, మనోహర్, రెడ్డప్ప, ఈశ్వరప్ప, శ్రీరామ్‌నాయుడు, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిమాన్విత ప్రస్థానం శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం

**- నిత్యపూజలు అందుకుంటున్న జిల్లాలోనే అతిపెద్ద శివలింగం - రోగగ్రస్థులు ఆలయంలో పూజలు స్వస్థత చేకూరుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం - నేడు శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవం**

పామిడి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

అదేదో మారుమూల ప్రాంతం అనుకుంటున్నారా.. కాదండి బాబూ.. వస్త్ర వ్యాపార రంగంలో రెండవ ముంబాయిగా ప్రసిద్దిగాంచిన పామిడి పట్టణం. జిల్లాలోనే పేరెన్నికగన్న దేవాలయాల్లో పామిడి శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం ఒకటిగా గుర్తింపు పొందిన ఇక్కడి అతిపెద్ద శివలింగం నిత్యం పూజలను అందుకుంటుంది. కోరిన కోరికలను తీర్చే కొంగు బంగారంగా శ్రీ భోగేశ్వరస్వామికి పేరుంది. ఈప్రాంతానికి రాష్ట్ర, జిల్లా నలుమూలల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు జరుపుతూ తమ తమ మొక్కబడులను చెల్లించుకుంటారు. దేవాలయంలో మహాశివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. మహాశివరాత్రి మహోత్సవం రోజున స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల వేలాదిమంది భక్తులు విరివిగా తరలివస్తుంటారు. మాఘ మాసంలో వేకువజామున ఒకపూట మాత్రమే పూజ జరుగుతుంది. మహాశివరాత్రి రోజున 5 సార్లు అభిషేక అర్చనలు జరుపుతారు. అదేరోజు రాత్రి శ్రీ ప్రసన పార్వతీ మహాదేవుని ఉత్సవ విగ్రహాలు ఉన్నటువంటి శకటా న్ని రకరకాల పూలతో అలంకరించి విద్యుత్ దీపాల వెలుగులో పట్టణ ప్రధాన వీధులగుండా ఊరేగిస్తారు. భజన మండలి సభ్యులు, భక్తాదులు భక్తిగీతాలను ఆలపిస్తూ వేకుమజాము వరకూ జాగరణ చేస్తారు. రోగగ్రస్థులు ఆలయంలో పూజలు చేయటం ద్వార వారికి స్వస్థత చేకూరుతుందని ప్రజల ప్రగాఢ నమ్మకం.

**శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయ చరిత్ర :** శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయానికి విశేష చరిత్ర ఉంది. విజయనగర సామ్రాజ్యం అనంతరం 1657లో సామంతరాజు పరమేశ్వర ఆలయాన్ని నిర్మించినట్లు ఇక్కడి శిలాపలకం ద్వార తెలుస్తోంది. తన బార్య భోగవతి ద్వార సామంతరాజు పరమేశ్వర శ్రీ భోగేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు ఆధారాలు ఉండగా ఈ ఆలయం ప్రక్కన ఉన్నటువంటి గ్రామాన్ని భోగపట్టణం అని పిలిచేవారు. తదనంతరం శేషగ్రంధిపురంగా మారింది. గతంలో పెన్నానది ఉదృతంగా ప్రవహిస్తుండటం ఇరువైపులా ఉన్న ప్రాంతాలకు రాకపోకలు సాగించటానికి అంతరాయం కలిగేది. పెన్నానదిని దాటి వెళ్ళేందుకు అనువుగా ఆలయ ప్రాంగనం నుండి పెన్నానది అవలి ఒడ్డున ఉన్న సత్రం వరకూ భూగర్భమార్గం నిర్మించగా కాలక్రమంలో అది మూసుకుపోయినట్లు తెలుస్తోంది. పెన్నానదికి వరదలు వచ్చినప్పుడు ఈ మార్గం ద్వారనే రాకపోకలు జరిగేవి, విజయనగర సామ్రాజ్యం పతనం అనంతరం ముస్లింల దండయాత్ర నేపద్యంలో హిందూ దేవాలయాలు శిల్పకళను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై పడింది. హళేభీడు (కర్ణాటక) గ్రామస్థులు అక్కడి ఆలయాలతో పాటు గ్రామాన్ని మట్టితో కప్పేయగా పురావస్తుశాఖ వారు తవ్వకాలు జరిపి హళేభీడును వెలికితీశారు. ఇదేక్రమలో పామిడిని కూడా మట్టి ఇసుకతో కప్పేయటంతో ఆలయ ఆనవాళ్ళు లేకుండా గ్రామం కనుమరుగైంది.

**పామిడికి ఆ పేరెలా వచ్చింది :** పెన్నానది ప్రక్కన ఉన్నటువంటి క్షేత్రపాలకొండ(శింగిరప్పకొండ)కు సమీపంలోని గ్రామమే పామిడి, ఈ కొండను అనుకుని ఉన్న గ్రామాన్ని క్షేత్రపాలకొండ పట్నం అనే పేరుతో పిలుస్తుండేవారు. ఆ గ్రామంలోని ఓ కాపు కులస్థునికి ఆవుల మంద ఉండేది. ఆవుల మందను క్షేత్రపాలకొండ పట్నంకు ఈశాన్యం రెండు కిలోమీటర్ల దూరంలో (ప్రస్తుతం శ్రీ భోగేశ్వరస్వామి దేవాలయం ప్రాంతం) చుట్టూ అడవులు ఉండటం కారణంగా ఆవులను మేతకు వదులుతుండేవారు. ఆవుల మంద నిత్యం అడవులకు పోయి వస్తుండగా కొంత కాలానికి మందలోని ఒక ఆవు పెన్నానది ఒడ్డునున్న పుట్టమీద నిలుచుని పాలు ఇస్తున్న విషయాన్ని గమనించిన కాపరి సమాచారాన్ని గ్రామస్థులకు చేయటంతో జనం తండోపతండాలుగా పుట్ట వద్దకు చేరుకుని పుట్టను ఓ పాము ముడివేసుకుని ఉండటాన్ని గమనించి దాని తొలగించి అక్కడ తవ్వకాలు జరుపగా అద్భుతమైన ఆలయ గోపురం గుచరించింది. మట్టిని క్రమంగా తొలగించగా ఎకరా విస్తీర్ణంలో ఉన్న ఆలయం బయట పడింది. ఆలయంలోని మూలవి రాట్ శివలింగం నాలుగు అడుగుల ఎత్తులో పానపట్టం ఆరు అడుగుల ఎత్తులో చూడగానే భక్తిభావం కలిగే విధంగా గోచరించగా అప్పటినుండి గ్రామస్థులు అక్కడే స్థిరపడ్డారు. గ్రామానికి పేరు లేకపోవటంతో పుట్టకు పాము ముడి వేసుకున్న ప్రాంతం కావటంతో పాముముడిగా, పమిడిగా, పామిడిగా రూపాంతరం చెందింది.

**శ్రీ భోగేశ్వరస్వామి మహిమలు :** ఆలయంలోని మూలవిరాట్ శ్రీ భోగేశ్వరస్వామి అనేక మహిమలను కనబరిచినట్లు భక్తులు చెబుతుంటారు. భక్తిభావంతో స్వామి వారిని దర్శించుంటే కుష్ఠురోగం నయం అవుతుందని, సంతానం లేనివారికి సంతానప్రాప్తి కలుగుతుందని నమ్మకం. ఎలాంటి క్లిష్ట పరిస్థితులు సమస్యలు ఎదురైనప్పటికీ స్వామి వారిని పూజిస్తే అవన్నీ తొలగిపోతాయన్నది స్వామిపై వారికున్న నమ్మకానికి నిదర్శనం. స్వామి వారి తీర్థప్రసాదాలు తీసుకున్న ప్రతిఒక్కరి హృదయంలో శ్రీ భోగేశ్వరస్వామి కొలువై ఉంటారని పూర్వీకులు చెబుతుంటారు.

**భక్తులకు అన్నివిధాల సౌకరాలు.. ఈఓ క్రిష్ణయ్య :** శ్రీ భోగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు దేవాలయాని భక్తుల రద్దీ పెరుగుతున్న నేపద్యంలో వారికి అన్నివిధాల సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు దేవాలయ కార్య నిర్వాహణాధికారి క్రిష్ణయ్య తెలిపారు. ఆలయ అభివృద్ధిలో బాగంగా రాజగోపురం, నూతన ఆలయ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలియజేశారు. మహాశివరాత్రి మహోత్సవానికి ఏర్పాట్లను సిద్దం చేశామని వేకువజామున గణపతిపూజ, పుణ్యాహవాచనము, ఏకవారదశవార రుద్రా భిషేకం అనంతరం స్వామి వారి దర్శనం మద్యాహ్నం మహనా్యసపూర్వక ఏకవారదశవార రుద్రాభిషేకం స్వామి వారి ప్రత్యేక అలంకరణ దివ్యదర్శనం రాత్రి శ్రీ ప్రసన్న పార్వతీ భోగేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం జరుపబడుతుందని భక్తులు తరలివచ్చి స్వాముల వారిని దర్శించుకుని పూజలు చేపడుతూ తీర్థప్రసాదాలను స్వీకరించి స్వాముల వారి కృపకు పాత్రులు అవ్వాలని ఆయన కోరారు.

# అట్టహాసంగా తాడిపత్రి వక్ఫ్‌బోర్డు కమిటీ ప్రమాణస్వీకారం

**- భావోద్వేగానికి లోనైన మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు మహమ్మద్ అయూబ్



భావోద్వేగానికి లోనవుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



హాజరైన ముస్లింలు

తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

తాడిపత్రి మండల వక్ఫ్ బోర్డు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి భావోద్వేగానికి లోనై ప్రసంగించారు. వక్ఫ్ బోర్డు కమిటీ అధ్యక్షులుగా మహమ్మద్ అయూబ్, ఉపాధ్యక్షులుగా నజీర్, ప్రధాన కార్యదర్శిగా ఫరూక్, సంయుక్త కార్యదర్శిగా నాజుబాష, ట్రెజరర్‌గా పీరా, డైరెక్టర్లుగా నూర్‌బాషా, ఇమాంసాబ్, సిలార్ దస్తగిరి, ఖలందర్‌బాష, రఫీ, మహబూబ్‌బాషా, లీగల్ అడ్వైజర్‌గా హనీఫ్‌లచే ప్రమాణ స్వీకార కార్యక్రమం జె.సి దివాకర్‌రెడ్డి ఆడిటోరియం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేశారు. తాడిపత్రి ముస్లిం మైనార్టీ సదస్సు పేరుతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాడిపత్రిలో వక్ఫ్ బోర్డు కమిటీకి సంవత్సరానికి ఎంత ఆదాయం వస్తుంది, ఎంత ఖర్చవుతుంది అన్న వివరాలు ఫ్లెక్సీ రూపంలో వెల్లడించారు. గత వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వంలో వక్ఫ్ బోర్డు కమిటీకి వస్తున్న ఆదాయాన్ని లెక్క చూపలేదని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత ఎంత ఆదాయం వచ్చిందో పాంప్లెట్ రూపంలో పొందుపరిచి అందరికీ వివరించారన్నారు. వక్ఫ్ బోర్డు కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అయుబ్‌తో పాటు కమిటీ సభ్యులందరితో వక్ఫ్ బోర్డు నియమ నిబంధనలను అనుసరించి వ్యవహరిస్తామని ప్రమాణం చేయించారు. జె.సి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు కమిటీ ఆదాయ ఖర్చులను ప్రతి మూడు నెలలకు ఒకసారి అందరికీ తెలియపరచాలన్నారు. తాను ఎక్కడో కూర్చున్న తరువాత ప్రజలు నన్ను గెలిపించి పట్టం కట్టారని వారి రుణం తీర్చుకోలేనిదని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి నాయకులు నియాజ్‌బాష, గోరబాష, గయాజ్‌బాష, కౌన్సిలర్ రేష్మ పర్వీన్, విజయ్, ముస్లిం మతపెద్దలు, ముస్లింలు పాల్గొన్నారు.

# మెడికల్ మాఫియాను అరికట్టాలని సిపిఐ నాయకుల నిరసన

పుట్లూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మెడికల్ మాఫియాను అరికట్టాలని రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపు మేరకు పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయం వద్ద శనివారం సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి డి.పెద్దయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న మెడికల్ మాఫియా ప్రజలు జీవించే హక్కుపై పరోక్ష దాడి కొనసాగిస్తుందన్నారు. నాణ్యత లేని బోగస్ మందులు విచ్చలవిడిగా మార్కెట్లో ప్రవేశించి వేలాదిమంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టుతున్నాయన్నారు. ఇది కేవలం వైద్యరంగ సమస్య మాత్రమే కాదని ఇది ప్రజల ప్రాణాలపై జరుగుతున్న వ్యవస్థీకృత దోపిడి, ఫార్మా స్యూటికల్ కంపెనీల అధిక లాభాల ఆశ, కార్పోరేట్ ఆసుపత్రుల వ్యాపార ధోరణి అన్నారు. పరీక్షల పేరుతో ల్యాబ్ సెంటర్లో భారీగా దందా కలిసి ప్రజలను ఆర్థికంగా శరీరకంగా దోచుకుంటున్నాయన్నారు. ఈ పరిస్థితిని అరికట్టడంలో ఈ ప్రభుత్వం ఘోర వైఫల్యం చెందుతుంది. డ్రగ్స్ కంట్రోలర్ వ్యవస్థ బలహీనత, పర్యవేక్షణ లోపం, బాధ్యులపై కఠిన చర్యల లోపం, ఇవి మెడికల్ మాఫియాకు ప్రోత్సాహం కల్పిస్తున్నాయన్నారు. బోగస్ మరియు నాణ్యత లేని మందులపై రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక దాడులు నిర్వహించాలని, డ్రగ్స్ కంట్రోల్ వ్యవస్థను బలోపేతం చేసి బాధ్యులపై కఠిన శిక్షలు విధించాలని, కార్పోరేట్ ఆసుపత్రి దందాపై స్వతంత్ర విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని, ల్యాబ్ సెంట ర్‌లో టెస్టుల ధరల నియంత్రణ తప్పనిసరిగా చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బాలు, ఓబుళపతి, పెద్దన్న, నారాయణ, సూరి, నగేష్, రంగనా యకులు, నాగరా జు, అంజి, పుట్లూరు నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

# నరమృగవాహనంపై ఊరేగిన పరమేశ్వరుడు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి శనివారం రాత్రి నరమృగ వాహనంపై పురవీధుల్లో ఊరేగారు. ఉదయం అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి అనంతరం ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఇందులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహవాచనము, పంచావరణ పూజ, వేదపారాయణము, పరివారదేవతా హోమాలు, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం, తదితర పూజలు నిర్వహించారు. అలాగే శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారిని అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి, నవగ్రహాలకు అర్చకులు నందుస్వామి, రామకృష్ణశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రాత్రి స్వామివారు నరమృగవాహనంపై భక్తులకు దర్శ నమిచ్చారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, ఆలయ సిబ్బంది విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



నరమృగవాహనంపై శ్రీబుగ్గరావలింగేశ్వరుడు

# దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న కమలమ్మ

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మడకశిర పట్టణంలో శనివారం నిర్వహించిన తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో తాడిపత్రి పట్టణానికి చెందిన రాష్ట్ర మాల కార్పోరేషన్ డైరెక్టర్ కొంకరి కమలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిన సేవలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి హర్షకుమార్, మాజీ ఎంఎల్సి గుండుమల తిప్పేస్వామి, తదితర నాయకులు పాల్గొన్నారు.



విగ్రహావిష్కరణలో పాల్గొన్న కమలమ్మ

## పాలతలకొండకు భారీ ఎత్తున తరలివెళ్లిన భక్తులు

యాడికి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు శ్రీఅక్కమహాదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక శ్రీఅయ్యప్పస్వామి ఆలయం వద్ద వున్న పెద్దమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున భక్తులు ప్రత్యేక వాహనాల్లో కడప జిల్లాలోని పొలతలకొండకు తరలివెళ్లారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పొలతలకొండలో శ్రీఅక్కమ్మదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను తీర్చుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాయలచెరువు గ్రామానికి చెందిన రంగరాజుకుంట రామాంజనేయులు, రంగరాజుకుంట బ్రదర్స్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పాలతలకొండకు తరలివెళుతున్న దృశ్యం

## శివరాత్రికి ముస్తాబైన శివాలయం

యల్లనూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

యల్లనూరు మండల కేంద్రంలో కోట వీధిలో వెలసిన శివాలయాన్ని వివిధ రకాల విద్యుత్‌దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. మహా శివరాత్రి పర్వది నాన్ని పురసకరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. ఆదివారం ఉదయం శివునికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు. మహాశివరాత్రి పండుగను పురస్కరించుకుని ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేపట్టారు.



పాలతలకొండకు తరలివెళుతున్న దృశ్యం

## ప్రత్యేక పుష్పాలంకరణలో శ్రీరంగనాథస్వామి

తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మాఘమాసం చివరి శనివారం పురస్కరించుకుని తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు. ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, తులసి దళాలతో ప్రత్యేకం గా అలంకరించి అర్చనలు, ఆకుపూజలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా కోనలో వెలసిన శ్రీఆంజనేయస్వామి, శ్రీషిరిడిసాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్దఎత్తున భక్తులు ఆలూరుకోనకు తరలివచ్చి శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు జలపాతాల్లో స్నానాలు చేసి స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. అనంతరం భక్తులు నిత్య అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ రామాంజ నేయులు, ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగనాయకులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, సిబ్బంది కాశీ పాల్గొన్నారు.



శ్రీరంగనాథస్వామిని అలంకరించిన దృశ్యం

## శ్రీకోదండ రామాలయంలో మాఘమాసం పూజలు

అమడగూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

అమడగూరు మండల పరిధిలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలి కోట గ్రామంలో వెలసిన శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనే యస్వామి దేవాలయం, శ్రీషిరిడిసాయి బాబా ఆలయం, శ్రీచాడేశ్వరిదేవి ఆలయం, పిచ్చిలికొండ వీరాంజనేయ స్వామి ఆలయంలో మాఘమాసం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామివారికి పంచామృతా భిషేకాలు, నూతన వస్త్రాలతో అలంకరణ, అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం హాజరైన భక్తులకు పంచామృత తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## అవార్డులు అందుకున్న పుట్లూరు విద్యార్థులు

పుట్లూరు, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

అక్షర సౌత్ ఇండియా హ్యాండ్‌రైటింగ్ కాంపిటీషన్‌లో పుట్లూరు మండల కేంద్రంలోని రాయలసీమ స్కూల్ విద్యార్థినులు కె.రుక్సానా (5వ తరగతి), ఎస్.ఖ్యాతి (1వ తరగతి) స్టేట్ లెవల్ అవార్డులు సాధించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో వారు ఎం.కోదం డరాం చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు సాధించిన విద్యార్థినిలను రాయలసీమ స్కూల్ కరస్పాండెంట్ ఎస్.రమేష్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



అవార్డులు అందుకుంటున్న విద్యార్థినిలు

## పప్పుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

పప్పుశనగకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తాడిపత్రి మార్కెట్‌యార్డు వద్ద నిరసన తెలియచేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం పకృతి అనుకూలించి రైతుకు సంతృప్తికరమైన దిగుబడి వచ్చిందన్నారు. పకృతి సహకరించిన రైతు మార్కెట్ మాయాజాలంలో చిత్తవుతున్నారన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని ప్రభుత్వం పప్పుశనగకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కమిటీ సభ్యురాలు శిరీష పాల్గొన్నారు.





మాట్లాడుతున్న రాజారామిరెడ్డి

06ATP14_06ATP14.qxd 14-02-2026 PM 11:11 Page 1



## ఆర్డిటి సంస్థ ఇతర దేశాలకు తరలిపోతే ఆ పాపం కూటమి ప్రభుత్వానిదే

**- మాజీ ఎంపీ తలారి రంగయ్య హెచ్చరిక**



**ఆర్డిటి సంస్థ కోసం తిమ్మప్ప కొండలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం**

కళ్యాణదుర్గం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ఆర్ డి టి సంస్థ ఇతర దేశాలకు తరలి పోతే ఆ పాపం కూటమి ప్రభుత్వం దేనని కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య హెచ్చరించారు. శనివారం విట్లంపల్లి గ్రామ సమీపంలోని తిమ్మప్ప కొండకు మెట్లెక్కి, శ్రీ తిమ్మప్ప దేవదేవునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రలు, మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించి ఆర్ డి టి సంస్థను కొనసాగించాలని డిమాండ్ చేశామన్నారు. అయినా రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం స్పందించలేదన్నారు. కేంద్రం దోస్తీలో ఉన్న కూటమి ప్రభుత్వం ఆర్ డి టి సంస్థను రక్షించుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదని ఆరోపించారు. కరువుకు పేరుగాంచిన అనంతపురం జిల్లాలో పేదరిక నిర్మూలన కోసం ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి పేదలకు అండగా నిలిచిన ఆర్డీసీ సంస్థకు కేంద్ర ప్రభుత్వం ఎఫ్ సి ఆర్ ఎ రెన్యువల్ చేయకుండా విదేశీ నిధులు ఆర్డిటి సంస్థకు అందకుండా చేసిందని, ఈ కారణంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆర్డిటి సంస్థ సొంత ఆస్తులను అమ్మకానికి పెట్టడమే కాకుండా కనేకల్లు, కళ్యాణదుర్గం ఆసుపత్రులను మూసివేసేందుకు సిద్ధమవుతోందన్నారు. ప్రభుత్వం చేయలేని ఎన్నో సంక్షేమ అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్న ఆర్డిటి సంస్థ అనంతపురం జిల్లా నుండి శ్రీలంక లాంటి విదేశాలకు తరలి పోతే జిల్లా పేద ప్రజలు తీవ్రంగా నష్టపోతారని హెచ్చరించారు. ఆర్డిటి సంస్థను పాలక ప్రభుత్వం పరిరక్షించుకోకపోతే అనంతపురం జిల్లా ప్రజల ఆగ్రహాన్ని చవి చూడక తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల అధినేతలకు ఆ తిమ్మప్ప దేవదేవుడు పాలక ప్రభుత్వాలకు మంచి బుద్ధి ప్రసాదించి ఆర్డిటి కొనసాగించేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీ సింహ గర్జన సభను జయప్రదం చేయాలి



**ఆర్ అండ్ బి అతిథి గృహంలో పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం**

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

భారత చైతన్య యువజన పార్టీ (బీసీవై పార్టీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 22న విజయవాడ నగరంలో, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న పూలే ప్రాంగణంలో నిర్వహించ నున్న బీసీ సింహ గర్జన సభను జయప్రదం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కళ్యాణదుర్గం నియోజకవర్గం ఆర్అండ్బీ గెస్ట్ హౌస్లో సభకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీసీవై పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ, బీసీలకు రాజధానిలో 1000 ఎకరాల భూమి కేటాయించాలని, బీసీ రక్షణ చట్టంను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే స్థానిక సంస్థల్లో బీసీలకు 44 శాతం రిజర్వేషన్లు కల్పించాలి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచాలి, ఉద్యోగాలలో రిజర్వేషన్ శాతం పెంచాలి, బీసీ కార్పొరేషన్కు తగిన నిధులు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు లింగారెడ్డి, ప్రభాకర్ హరినాథ్, ఓబులేష్, వాల్మీకి ఆదర్శ్, రాము నాయక్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కల్యానికి హాజరైన భక్తులుకల్యాణ వైభోగమే

**- మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వైభవంగా శివపార్వతుల కల్యాణం**





**ప్రత్యేక అలంకరణలో శివపార్వతుల విగ్రహాలు, స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ధర్మకర్త హనుమంతరాయుడు,**

కంబదూరు, ఫిబ్రవరి 14, ప్రభాతవార్త

కంబదూరు మండల కేంద్రంలోని మల్లేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం శివపార్వతుల కల్యాణం మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా శివనామస్మరణతో మార్మోగిపోయింది.వేద మంత్రోచ్చారణల మధ్య బ్రాహ్మణులు శాస్త్రోక్తంగా కల్యాణ కార్యక్రమాన్ని నిర్వహించగా, భక్తులు భక్తి పరవశంలో తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ ధర్మకర్త గాజుల హనుమంత రాయుడు కుటుంబ సమేతంగా పట్టు వస్త్రాలను సమర్పించారు.కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు హాజరై, స్వామి అమ్మవార్ల ఆశీర్వాదాలను పొందారు. ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణం అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.శివపార్వతుల దివ్య కల్యాణంతో ఆలయం భక్తి భావంతో నిండిపోయి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో ఈవో దేవదాస్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## పరిగి చెరువుకు హంద్రీనివా జలాలు



**నీటి విడుదల లో పాల్గొన్న కూటమి నాయకులు**

పరిగి ఫిబ్రవరి 14(ప్రభాత వార్త )

పరిగి చెరువు కు కూటమి నాయకులు హంద్రీనివా నీటిని విడుదల చేసి హర్షం వ్యక్తం చేశారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు పరిగి మండలం లోని పరిగి చెరువుకి హంద్రీనీవా నీళ్లు కాలువ ద్వారా పరిగి చెరువుకు రావడం జరిగింది, ఈ కార్యక్రమంలో పరిగి మండల కన్వీనర్ ఎస్ ఎన్ గోవింద్ రెడ్డి మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి హన్నమయ్య మరియు మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు మరియు ఫై మ్యాన్ కమిటీ ఎక్స్ ఎంపీటీసీ సోమప్ప తెలుగు యువత ప్రవీణ్ రెడ్డి మారుతి ప్రసాద్ తిలక్ లక్ష్మణరావు చెరువు సంఘంచైర్మన్ శివ సుబ్రహ్మణ్యం మరియు ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు



**శ్రీ సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం**

కళ్యాణదుర్గం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదిక వద్ద, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు సూచనల మేరకు, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలను బంజారా సోదరులతో కలిసి టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ హిందూ ధర్మ గొప్పతనాన్ని బంజారాలకే కాక యావత్ ప్రజలకు తెలియజేస్తూ జీవించారని కొనియాడారు. హింస పాపమని, మత్తు మరియు ధూమపానం శాపమని హితబోధ చేస్తూ బంజారా జాతితో పాటు అన్ని కులాలకు ఆదర్శంగా నిలిచిన మహనీయుడని పేర్కొన్నారు. అహింసా సిద్ధాంతాన్ని తన జీవనంతో ఆచరించి చూపిన మహాభక్తుడైన సేవాలాల్ మహారాజ్ జయంతిని జరుపుకోవడం మనందరి అదృష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తలారి గౌతమి సోమశేఖర్, మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి రమేష్, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు మాదినేని మురళి, కళ్యాణదుర్గం రూరల్ అధ్యక్షుడు గోళ్ళ వెంకటేషులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ ధనునాయక్, జిల్లా పార్లమెంట్ కార్యదర్శి షామీర్, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ, మాజీ జడ్పీటీసీ కొల్లాపురప్ప, కురుబ సంఘం నాయకుడు కామక్కపల్లి నాగరాజు, క్లస్టర్ ఇంచార్జ్ భోగేష్ చౌదరి, సర్పంచ్ లాల్ కృష్ణతో పాటు భీమలింగ, రాజేష్, ప్రకాష్, లోకేష్, చంద్రమోహన్, కామక్కపల్లి చంద్ర, షెక్యానాయక్, గోళ్ళ చంద్రానాయుడు, వాలేనాయక్, చంద్రానాయక్, సుబ్బానాయక్, రాజునాయక్, రామునాయక్, వెంకటేష్ నాయక్, వన్నూనాయక్, సోమ్లానాయక్, మన్ను తదితర బంజారా సోదరులు పాల్గొన్నారు.

## తప్పిన పెను ప్రమాదం

**- అధికారుల నిర్లక్ష్యంపై స్థానికుల ఆగ్రహం**

కనేకల్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



కనేకల్ పట్టణంలోని దిగువ గేరి ప్రాంతంలో శనివారం సాయంత్రం పెను ప్రమాదం తృటిలో తప్పింది. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న పాత విద్యుత్ స్తంభలు ఒక్కసారిగా కూలిపడి సమీపంలోని ఓ నివాస గృహంపై ఒక స్తంభం పడింది. అదే సమయంలో ఆ మార్గంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రిక్షా కూడా అక్కడి గుండా ప్రయాణిస్తుండగా, క్షణాల్లో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికుల వివరాల ప్రకారం,సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో గట్టిగా శబ్దం వినిపించడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. విద్యుత్ స్తంభం ఇంటి పైకప్పును దెబ్బతీయడంతో పైకప్పు షీట్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు కూడా భయంతో వణికిపోయారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ విద్యుత్ స్తంభం గత కొంతకాలంగా వంగి ప్రమాదకర స్థితిలో ఉందని, గాలివానల సమయంలో మరింత ప్రమాదం సంభవించే అవకాశముందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. "ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితేనే అధికారులు స్పందిస్తారా?" అంటూ వారు ప్రశ్నిస్తున్నారు.ఘటన అనంతరం సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని కూలిన స్తంభాన్ని తొలగించి తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను తొలగించారు. ఈరోజు దిగువగేరి అంధకారంలో ఉన్నట్టు సమాచారం. అయితే పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలని, పట్టణంలోని ఇతర ప్రమాదకర స్తంభాలను కూడా తనిఖీ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ ఘటనతో పట్టణ ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సంబంధిత అధికారులు నిర్లక్ష్యాన్ని విడనాడి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఇటువంటి ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు జోరుగా ఏర్పాట్లు



**విగ్రహ ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం**

కణేకల్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

కణేకల్ మండలంలోని అంబాపురం గ్రామంలో భారత రాజ్యాంగ శిల్పి, భారతరత్న బి ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పనులు శరవేగంగా కొన సాగుతున్నాయి. గ్రామ ప్రజల సహ కారంతో అంబాపురం అంబేద్కరిస్టుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.సామాజిక న్యాయం , సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం అనే రాజ్యాంగ విలువలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన అంబేద్కర్ ఆశయాలను గ్రామ యువతలో నాటడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.విగ్రహ స్థాపన స్థలంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక, శారీరక సహకారం అందిస్తున్నారు. త్వరలోనే ఘనంగా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.ఈ కార్యక్రమం గ్రామంలో సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలవనుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## వక్కలిగల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లడం పట్ల హర్షం

అమరాపురం ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



**మాట్లాడుతున్న వక్కలిగసంఘం నాయకులు**

మడకశిర నియోజక వర్గంలోని వక్కలిగ లను ఓ బి సి జాబితా లో చేర్చాలని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామిలు తీసుకెళ్లడం పట్ల అమరాపురం వక్కలిగ సేవా సమితి కార్యదర్శి సాయి విద్యానికేతన్ పాఠశాల కరస్పాండెంట్ నాగోనపల్లి మంజునాథ్, మహేంద్ర గ్రానైట్స్ యజమాని నాగభూషణ్ సప్లయర్స్ రాఘవేంద్ర, ఈ నాగరాజు,టి.డి. వీరక్యాతప్ప లు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మడకశిర నియోజకవర్గం లోవక్కలిగలను రాష్ట్ర ప్రభుత్వంలో బీసీ బి జాబితాలో చేర్చి ఉన్నట్లు కానీ కేంద్రంలో జనరల్ కేటగిరీ కిందవున్నది. కావున వక్కలిగలను కేంద్రంలో ఓబీసీ రిజర్వేషన్ కింద చేర్చాలని వినతి పత్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడుకి ఇవ్వడంపై అమరాపురం వక్కలిగ సేవా సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మడకశిర నియోజకవర్గంలో ఎంతోమంది ఎమ్మెల్యేలు పనిచేసినప్పటికీ ఎప్పుడూ కూడా మా కులస్తులపై ఇంత శ్రద్ధ చూపడం లేదనివారు పేర్కొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

గుత్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



**చెక్కు అందచేస్తున్న దృశ్యం**

అనారోగ్య దృష్ట్యా ఆసుపత్రిలో వైద్య సేవలు పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా చేయూత అందిస్తామని ఎమ్మెల్యే తనయుడు, గుత్తి టిడిపి ఇన్చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులు స్థానికంగా ఉన్న రంగస్వామికి 1,05,000, వెంకటరామిరెడ్డికి 62 వేల రూపాయల ఆర్థిక సాయం చెక్కులను వారి స్వగృహాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటిదాకా 30 విడతల్లో దాదాపు 4 కోట్ల రూపాయలను ఎమ్మెల్యే జయరాం అందజేశారని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని పేర్కొన్నారు. అంతకు మునుపు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి అబ్కస్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



**బహుమతి అందుకుంటున్న సాయి ప్రహర్షిత**

వజ్రకరూరు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మండలంలోని గంజిగుంట గ్రామంలో ఉన్న శ్రీ సాహితీ విజ్ఞాన్ పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయి ప్రహర్షిత రాష్ట్రస్థాయి అబ్ కస్ పోటీలలో ప్రతిభను చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. శనివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విద్యార్థిని సాయి ప్రహర్షిత సీనియర్ లెవెల్ 2 లో స్టేట్ సెకండ్ ప్రైజ్ సాధించింది. ఇదే పాఠశాలకు చెందిన చందన అనే మరో విద్యార్థిని తృతీయ స్థానంలో నిలిచింది. విద్యార్థినిలను పాఠశాల యాజమాన్యం ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు వేణుగోపాల్, జాకీర్ హుస్సేన్ ప్రకాష్, రామాంజనేయులు అభినందించారు.

## రాష్ట్ర బడ్జెట్ అభ్యున్నతికి తోడ్పడే విధంగా లేదు

**- జి.ఎల్.నరసింహులు**



**జిఎల్ నరసింహులు**

కొత్తచెరువు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

రాష్ట్ర, ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చెబుతున్న వికసిత ఆంధ్రప్రదేశ్ మాటల్లో గొప్పగా చేతల్లో శూన్యంగా ఉంది సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎల్ నరసింహులు అన్నారు . బడ్జెట్ కేటాయింపుల్లో వ్యవసాయానికి కేవలం 4 శాతం కేటాయించి వ్యవసాయ రంగానికి తీరని అన్యాయం చేసింది. ధరల స్థిరీకరణకు 3000 కోట్లు అవసరం కాగా 500 కోట్లు మాత్రమే కేటాయించడం చాలా అన్యాయం అన్నారు గ్రామీణ అభివృద్ధికి గత బడ్జెట్లో 8.3 ఉంటే ఈ బడ్జెట్లో 7.4 శాతానికి అంటే ఒక శాతం తగ్గించడం జరిగింది. వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులకు అదనపు నిధులు కేటాయించలేదు. వెలిగొండ, హంద్రీనీవా, వంశధార తదితర ప్రాజెక్టుల నిర్మాణానికి నిధులు కేటాయించాలి. అభివృద్ధి చేయడంలో విఫలమై పిపిపి పేరుతో ప్రైవేట్ రంగంపై నెట్టింది. ఇంటికొక పారిశ్రామికవేత్త నినాదం . ఆశాజనకంగా లేకపోగా చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం లేదు. ప్రభుత్వ విధానాలు ఇంటికి ఒక నిరుద్యోగిని సృష్టించాయి.

## మహాశివరాత్రికి ముస్తాబైన దేవాలయాలు





**బత్తలపల్లి లో విశేష అలంకరణలో ఓంకారేశ్వరుడు, పోట్లమర్రిలో విశేష పూజలందుకున్న మల్లేశ్వరుడు**

బత్తలపల్లి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మహాశివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని మండలంలోని వివిధ దేవాలయాలు, శివాలయాలు ఉత్సవాలకు ఆయా గ్రామాల గ్రామ పెద్దలు సిద్ధం చేశారు. మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంఘమేశ్వర క్షేత్రంలోని ఈశ్వరాలయానికి సంబంధించి కొన్ని చారిత్రాత్మక ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనా సమయంలో ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చి అప్పాజీ పేరుతో అప్పరాజుచెర్ల గ్రామాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఈశ్వరాలయం వెనుక దేవనాగరలిపిలో ఒక శాసనం ఉంది. ఆ శాసనాన్ని స్థానిక ఆర్కియాలజీ శాఖవారు సర్వేచేసి ఈ శాసనం రాయల కాలం నాటిదని తెలిపారు. ఆలయంలోని పంచలింగాలు, ఆలయగోపురం కూడా రాయలనాటి కాలంచే నదుల సంగమంలో కొన్ని దశాబ్దాల క్రితం నదులు వెల్లువెత్తి విలయతాండవం చేసినప్పుడు చాముండేశ్వరి విగ్రహం బయటపడింది. అది ఇప్పటికీ నదులు కలిసే ప్రాంగణంలో ఉంది. స్థల మహత్యాన్ని బట్టి పంచలింగాల ప్రతిష్ట జరిగిందిని పూర్వీకులు చెబుతున్నారు. అదేవిధంగా సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలోనూ పోటు కుమారులు ( సేవకులు) అధ్వర్యంలో ఆదివారం శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. బత్తలపల్లిలో నిర్మించిన శివాలయంలోనూ వేడుకలు నిర్వహించనున్నారు. పోట్లమర్రి, ముష్టూరు శివాలయాల్లో సైతం ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గంటాపురం అప్పస్వామి దేవాలయంలో వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్చకులు వివరించారు. రామాపురం వీరనారాయణస్వామి ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లను సిద్ధం చేశారు. మాల్యవంతంలో వీరనారాయణస్వామి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేసినట్లు ఆర్చకులు తెలిపారు. సోమవారం ఈ గ్రామాలలో జాతర నిర్వహించి భక్తులకు భవిష్యవాణిని వినిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వీటితోపాటు ఆయా గ్రామాలలోని దేవాలయల్లో వేడుకలు నిర్వహించేందుకు సిద్ధమైనట్లు అర్చకులు తెలిపారు. అదేవిధంగా మండలంలోని బత్తలపల్లి, అప్పరాచెరువు, మాల్యవంతం గ్రామాలలో పౌరాణి నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు.శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకొని అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాటు చేశారు సంఘమేశ్వర క్షేత్రంలో అప్పరాచెరువు గ్రామానికి చెందిన పెద్దల ఆధ్వర్యంలోనూ కాటికోటేశ్వర క్షేతంలో పోటు కుమారులు. పోట్ల మర్రి, గంటాపురం, రామాపురం మాల్యవంతం ముద్దూరు గ్రామాలలో భక్తులు, గ్రామ పెద్దలు అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పండుగను పురష్కరించుకొని ఆయా గ్రామాలలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిఘా పెట్టినట్లు సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్లు తెలిపారు.

## బడ్జెట్లో విద్యారంగాన్ని విస్మరించిన కూటమి సర్కార్

**-ఫీజుల పథకంలో కోత, విద్యార్థుల బకాయిల ఎగవేత**
**-తల్లికి వందనానికి ఎగనామం, లబ్దిదారుల సంఖ్య కుదింపు**
**-వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ వర్కింగ్ ప్రసిడెంట్ వై.ప్రణయ్రెడ్డి**

ఉరవకొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



**వై.ప్రణయ్రెడ్డి**

బడ్జెట్లో విద్యారంగాన్ని కూటమి సర్కార్ విస్మరించిందని విద్యకు కేటాయిం పులు నామమాత్రమేనని వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం రాయలసీమ వర్కింగ్ ప్రసిడెంట్ వై.ప్రణయ్రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ విద్యారంగానికి కేవలం 9.5శాతం మాత్రమే బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేసి చేతులు దులుపు కున్నారన్నారు. ముఖ్యంగా ఫీజుల పథకంలో చేసిన కేటాయింపులు విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేసేలా ఉన్నాయన్నారు. గత బకాయిలు ఈ విద్యా సంవత్సరంతో కలుపుకుంటే 8,900 కోట్ల రూపాయలు ఉన్నాయని అయితే బడ్జెట్లో కేవలం 3,836 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. మూడు రోజుల క్రితం బడ్జెట్ రిలీజ్ ఆర్డర్ ద్వారా 1,200 కోట్లు విడుదల చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా చేసిన ప్రకటన కేవలం ప్రకటనకే పరిమితమైందన్నారు. తల్లికి వందనం గత ఏడాది ఇవ్వాల్సినవి పూర్తిస్థాయిలో లబ్దిదారులకు నేటికీ అందలేదన్నారు. 80 లక్షల మందికి ఇవ్వాల్సి ఉండగా ఇప్పుడు బడ్జెట్లో కూడా 67 లక్షల మందికే ఇస్తున్నట్లు అవాస్తవ గణాంకాలను కూటమి ప్రభుత్వం వెల్లడించిందన్నారు. అందుకు బడ్జెట్ కేవలం 9,668 కోట్ల రూపాయలు కేటాయించి లబ్దిదారులను కుదించిందన్నారు. సంక్షేమ హాస్టళ్ళు, గురుకులాలాకు చేసిన కేవలం 300 కోట్ల కేటాయింపులు విద్యార్థుల సంక్షేమానికి ఏమాత్రం సరిపోవన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ని పొగడ్తలతో ముంచెత్తేలా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగం కొనసాగిందన్నారు. బడ్జెట్లో విద్యకు అరకొర కేటాయింపులు చేసి లోకేష్ను జాకీలు ఎత్తే ప్రచారంను కూటమి సర్కార్ సాగిస్తోందని విద్యార్థులకు జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని వై.ప్రణయ్రెడ్డి స్పష్టం చేశారు.

## ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

**-ఆశయాలు కొనసాగిస్తామన్న జై భీమ్ యువజన సంఘం**

ఉరవకొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



**దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతిని శనివారం పట్టణంలో జై భీమ్ యువజన సంఘం ఘనంగా నిర్వహించింది. 4వ వార్డు మాల వీధిలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహంవద్ద దామోదరం సంజీవయ్య చిత్రపటం ఉంచి పూలమాలవేసి పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆశయాలను ముందుకు తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యువజన సంఘం అధ్యక్షులు లేపాక్షి, గౌరవాధ్యక్షులు తమ్మన్న, కార్యదర్శి రాజేష్, ఉపాధ్యక్షులు సోమశేఖర్, సభ్యులు మోహన్, సూర్యనారాయణ, అజిత్, సురేష్, నల్లారెడ్డి, రాము, శివ, హనుమేష్, సాయిగిరి, మని, మల్లికార్జున, బాలాజీ, గోవిందు, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పెన్నహోబిళంలో వైభవంగా లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం

ఉరవకొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



**పెన్నహోబిళంలో లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం దృశ్యం**

జిల్లాలోనే ప్రసిద్ధ చెందిన ఉరవకొండ మండలం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహ స్వామి దేవస్థానంలో స్వస్తిశ్రీ విశ్వావసునామ సంవత్సరం మాఘమాసం ద్వాదశి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.యన్.తిరుమలరెడ్డి పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరిచ్చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

గుత్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త




**నూతన కమిటీ ఏర్పాటు అయిన దృశ్యం**

విద్యార్థులు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల బారిన పడకుండా స్థానికంగా ప్రభుత్వ పరంగా బాలుర జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పిడిఎస్యు నియోజక వర్గ కార్యదర్శి వినోద్, భరత్లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక శ్రీసాయి జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా నవీన్, తన్వీర్, ఉపాధ్యక్షుడిగా జయకృష్ణ, సహాయ కార్యదర్శిగా హాఫీజ్తో పాటు 19 మందితో కార్యవర్గం ఏర్పాటైంది.

## ఖురాన్ పోటీలలో రాష్ట్రస్థాయికి గుత్తి విద్యార్థులు ఎంపిక

గుత్తి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ఇస్తేక్బాల్-ఇ-రంజాన్ పురస్కరించుకొని నిర్వహించిన ఖురాన్ గ్రంథస్తం పోటీలలో గుత్తికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక కెఎం ఫంక్షన్హాల్లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సయ్యద్ మహమ్మద్ జునైద్, మహమ్మద్ అబ్దుల్ సమద్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు హాఫీజ్ రిజ్వాన్, మౌలానా అబ్దుల్ హక్, మహమ్మద్ రఫీక్ తదితరులు మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో పవిత్ర ఖురాన్ గ్రంథం వెలువడిం దన్నారు. పేదలకు, ఫిత్రా దాన ధర్మాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధ్యక్షుడు ఫజలుల్లా, తదితరులు పాల్గొన్నారు.



**ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం**

# గవిసిద్దేశ్వరుడుని దర్శించుకొద్దాం రండి




గవిలో వెలిసిన గవి సిద్దేశ్వర స్వామి శివరాత్రి వేడుకలకు సిద్ధమైన ఆలయం

డి. హిరేహాళ్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల దర్శనంకు ముస్తాబవుతున్న గవిసిద్దేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు సిద్ధం చేసింది దర్శించుకొద్దాం రండి. డి. హిరేహాళ్ మండలం హెచ్. సిద్దాపురం, హెచ్ ఎస్ తాండా గ్రామాల సమీపంలో ఇనుప కొండల మధ్యన ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో ప్రకృతి సౌందర్యం పచ్చదనంతో నిండిన ఆహ్లాదాన్ని పరుచుకుని కవి సిద్దేశ్వరుడు. గుహలో వెలిసి పూజలందుకుంటున్న గవిసిద్దేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఆలయ ధర్మకర్త హెచ్ జి రాములు ఆధ్వర్యంలో శోభాయమాన అలంకరణలతో స్వామివారి ఆలయాన్ని శివరాత్రి వేడుకలకు సిద్ధం చేశారు. స్వామివారి శివలింగం గవిలో వెలిసిందని అందుకే గవిసిద్దేశ్వరుడన్న నామంతో తరతరాలుగా పిలవబడుతున్నట్లు పురాణ గాథల్లో వివరించబడిందని సరిహద్దులోని ఆంధ్ర కర్ణాటక ప్రాంత ప్రజలు చెబుతున్నారు. స్వామివారి ఆలయం ఆవరణలో భక్తుల దర్శనార్థం108 లింగాల ప్రతిష్టాపన, ముందు భాగంలో దట్టమైన అడవి ప్రాంతం, ఇనుప కొండల మధ్య నుండి దారులా ప్రవహిస్తున్న జలంతో కూడిన సుందరంగా విరాజుల్లుతున్న నీటి కొలన భక్తులను ఆకట్టుకుంటుంది. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులు ఈ కొలన నీటిని తలపై వేసుకొని అనంతరం స్వామివారి దర్శనానికి వెళ్లే ఆనవాయితీ ఇక్కడ కొనసాగుతోంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఆంధ్ర కర్ణాటక లోని సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయించి మొక్కులు తీర్చుకుంటారు. భక్తితో స్వామివారిని పూజించే భక్తుల కోర్కెలు తీర్చే కొంగుబంగారం గవిసిద్దేశ్వర స్వామి అని స్వామివారిని దర్శించుకున్న భక్తులతో పాటు ఇక్కడి సమీప గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

# రాష్ట్రస్థాయిలో మెరిసిన లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులు

కనేకల్లు ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

మండలంలో విద్యా రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరోసారి తన ప్రతిభా పటిమను రుజువు చేసింది. గ్రామీణ ప్రాంతంలో ఉన్నప్పటికీ విద్యార్థులను రాష్ట్ర స్థాయిలో మెరిసేలా తీర్చిదిద్దుతూ విద్యలో నాణ్యతకు కొత్త ప్రమాణాలు నెలకొల్పుతోంది. ఈరోజు విజయవాడ నగరంలో ఘనంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీలలో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విశిష్ట విజయాలను సాధించారు. తన్వి, యశ్విత, మంజు మహర్షి, యశస్విని, అన్విత రాష్ట్ర స్థాయిలో మెరిసి తమ పాఠశాలకు కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చారు. కఠినమైన పోటీలో అనేక జిల్లాల నుంచి పాల్గొన్న విద్యార్థులను అధిగమిస్తూ విజయం సాధించడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా తన్వి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాల చరిత్రలో మరో గర్వకారణంగా నిలిచింది. ఆమె ప్రతిభ, పట్టుదల, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కలిసి ఈ విజయాన్ని సాధ్యంచేశాయి. అబాకస్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించడమే కాకుండా, వేగం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల అందిస్తున్న శిక్షణ ప్రశంసనీయం. పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు, భారతి మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా సరైన మార్గదర్శకత్వం, కృషి ఉంటే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని మా విద్యార్థులు నిరూపించారు" అని తెలిపారు. విద్యార్థుల విజయంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కనేకల్లు మండల ప్రజలు ఈ విజయాన్ని తమ ప్రాంత గౌరవంగా భావిస్తూ విద్యార్థులను అభినందిస్తున్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు సాధిస్తూ లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మరింత ఉన్నత స్థాయికి చేరాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

# శాశ్వత పూజకు విరాళం

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



శాశ్వత పూజకు విరాళం అందజేస్తున్న దృశ్యం

పట్టణంలోని సాయినగర్ లో వెలసిన షిర్డీసాయిబాబా ఆలయంలో శాశ్వత పూజకు దాత గోవిందునాయుడు విరాళం అందజేశారు. శనివారం ఈ మేరకు ఆలయంలో ఆలయ కమిటి అధ్యక్షులు వీరనారాయణకు దాత గోవిందునాయుడు శాశ్వత పూజకు రూ.10వేలు విరాళం అందజేశారు. అనంతరం షిర్డీసాయిబాబాకు దాత పేరిట అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, కార్యదర్శి రామలింగయ్య, ఉప కార్యదర్శి జేసీనాయుడు, కోశాదికారి సూర్యనారాయణ, బంధనాథం సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

# ఎస్టీ గురుకులాలు, గిరిజన తండాల్లో మౌళిక వసతులు కల్పించండి



ఉరవకొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ఎస్టీ సంక్షేమ గురుకులాలు, గిరిజన తండాలు, ఎరుకల వాడల్లో మౌళిక వసతులు మెరుగుపర్చాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు హుస్సేన్ నాయక్‌ను గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం అధ్యక్షులు సాకే పురుషోత్తం కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన్ను శనివారం అనంతపురం గెస్ట్‌హౌస్‌లో కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గిరిజనులకు ప్రభుత్వం ద్వారా రాయితీ రుణాలు సక్రమంగా అందేలా కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా గురుకులాలకు సొంత భవనాలు నిర్మించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సౌకర్యాలు, మౌళిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

# తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్ నమ్మవద్దు

రామగిరి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ప్రజలు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వాటిని నమ్మిమోసపోవద్దని ఎస్ఐ ప్రదీప్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మీ షో నుంచి ఫోన్‌కాల్ చేసి మీ షోలో బహుమతి గెలుచుకున్నారని చెబుతారని రిజిస్ట్రేషన్ చార్జీ, రవాణా చార్జీలు చెల్లించాలని తెలియజేస్తారన్నారు. వాటిని నమ్మి మీరు మోసపోవద్దన్నారు. మీ షో (7237085082) నెంబర్ నుంచి ముత్యాలంపల్లి గ్రామానికి అంగన్వాడీ టీచర్‌కు కూడా ఫోన్ చేసినట్టు తెలిసిందన్నారు. ఇలాంటి వారికి డబ్బులు పంపడం, ఓటిపి, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత సమాచారం, ఎట్టి పరిస్థితుల్లో పంచుకోవద్దన్నారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఫోన్‌కాల్ వస్తే తమకు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

# గణపతి హోమంతో ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

లేపాక్షి శ్రీవీరభద్రస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు గణపతి హోమంతో ప్రారంభమయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్ ఆధ్వర్యంలో వేద పండితులు సునీల్‌శర్మ నేతృత్వంలో వేదమంత్రాల నడుమ గణపతి హోమం దిగ్విజయంగా ముగిసింది. ఈ హోమ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కరణం రామానందన్ మాట్లాడుతూ లేపాక్షి బ్రహ్మోత్సవాల్లో స్థానిక గ్రామ పెద్దలు, యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**అమ్మవారి అలంకరణకు ప్రత్యేక పూలమాలలు :**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదుర్గాదేవి వీరభద్రస్వామి పాపనాశేశ్వరస్వామి వారి అలంకరణకు ఆలయ చైర్మన్ కరణం రామానందం తమిళనాడు నుండి ప్రత్యేక పూలమాలను తెప్పించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి అలంకరణకు పూమాలలు తెప్పించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**విద్యుత్ దీపాలతో లేపాక్షికి ప్రత్యేక శోభ :**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా లేపాక్షి ఆలయంతో పాటు గ్రామ వీధుల్లో రంగురంగుల విద్యుత్ దీపాల వెలుగులతో లేపాక్షి దేదీప్యమానంగా మెరిసిపోతోంది. రాత్రి సమయాల్లో పర్యాటకులకు లేపాక్షి ఓ నూతన లోకాన్ని తలపిస్తోంది. వీరభద్ర ఆలయంలో శనివారం సాయంత్రం చైర్మన్ రామానందన్ ఆధ్వర్యంలో ఆగమికులు సునీల్‌శర్మ వేద మంత్రోచ్చారణ మధ్య ధ్వజారోహణ కార్యక్రమం జరిగింది. ధ్వజారోహణ కార్యక్రమంలో ఈఓ నరసింహమూర్తి, ఆలయ అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లతో పాటు భక్తులు పాల్గొన్నారు.

# సిరివరంలో నీటి ఎద్దడి

## - పట్టించుకోని కార్యదర్శి, సర్పంచు



బిందెలతో నీటిని తీసుకెళుతున్న దృశ్యం

లేపాక్షి, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

లేపాక్షి మండల పరిధిలోని సిరివరం గ్రామంలో గత నెల రోజులుగా తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. ఈ విషయాన్ని సిరివరం కార్యదర్శికి, సర్పంచు దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు. వివరాల్లోకి వెళితే గత నెల రోజులుగా సిరివరంలో నీటి సమస్య నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. విద్యుత్ ఉన్న సమయాల్లో ద్విచక్ర వాహనాలు, సైకిళ్లపై బిందెలతో నీటిని తీసుకు వెళుతున్న సంఘటన బాధ కలిగిస్తోంది. సిరివరంలో నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వ బోర్లు ఉన్నాయి. కొన్నింటిలో భూగర్భ జలాలు తగ్గిపోగా మరికొన్నింటిలో మాత్రమే స్వల్పంగా నీరు వస్తోంది. ఉన్న నీటిని సక్రమంగా సరఫరా చేయకపోవడంతో నీటి సమస్య తలెత్తినట్టు పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కార్యదర్శి, సర్పంచు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజల కోరుతున్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు శివాలయాలు సిద్ధం..!

ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



పూజలందుకుంటున్న నందీశ్వరుడు

ధర్మవరం పట్టణంలో శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని శివాలయాలు ప్రత్యేకంగా అలంకరణ చేస్తున్నారు. శివుని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేక ఆకర్షణగా శివాలయాలుకనిపిస్తున్నాయి. ఇందులో భాగంగా ధర్మవరం పట్టణం గాంధీ నగర్ వద్ద ఉన్న సహస్ర సిద్ధి రామలింగేశ్వర ఆలయములో శనివారం త్రయోదశి రోజున మహానంది, శివునికి అభిషేక పూజలు ఆలయ అర్చకుడు పణి స్వామి చేశారు. అనంతరం భక్తుల చేత నంది విగ్రహానికి ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షులు చట్టా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకొని మృత్యుంజయ హోమం, రుద్రాభిషేకం పూజలు చేయడం ప్రత్యేకత అన్నారు. దీంతోపాటు కోలాట కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భారీ క్యూ లైన్లు ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. శివరాత్రి రోజున రాత్రి 9:30 గంటలకు గంగా జలాలతో స్పర్శ దర్శనం చేసుకునే అవకాశాన్ని భక్తులకు కల్పించామని తెలిపారు. ఆలయం వద్ద ఏర్పాటులో ఆలయ కమిటీ ప్రతినిధులు పూజారి నారాయణ, పెద్దకోట శ్రీనివాసులు, పుట్లూరు రాజు, దాసరి నాగరాజు, చంద్రశేఖర్, కొండమీద రాయుడు, జయ రాములు, శంకర్ శ్రీనివాసులు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజ్ఞ వికాసం పరీక్షకు విశేష స్పందన



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉరవకొండ, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎస్ఎఫ్ఐ, యుటీఎఫ్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్షకు విశేష స్పందన కనిపించింది. పట్టణ, చుట్టు ప్రక్కల గ్రామీణ ప్రాంతాలకు చెందిన దాదాపు 350 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం ప్రజ్ఞ వికాసం పరీక్ష ప్రశ్నా పత్రాలను యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు రామప్పచౌదరి, విడపనకల్లు, వ జ్రకరూరు మండలాల కార్యదర్శులు రఘు, ప్రసన్నకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హరూన్ రషీద్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలంటే భయం పోగొట్టడానికి ప్రతి ఏడాది ఈ పరీక్షను నిర్వహించడం జరుగుతోందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే ప్రశ్నా పత్రాన్ని తయారు చేయించి నిర్వహించిన ప్రజ్ఞ వికాసం పరీక్ష పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు రాజేష్, నాయకులు పవన్, తిరుమలేష్, అభిషేక్, సిద్దార్థ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివరాత్రి వేడుకల్లో భక్తులకు భద్రత కల్పిస్తాం



గవిసిద్దేశ్వర ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సి.ఐ.

డి.హిరెహాళ్ ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

అన్ని శాఖల అధికారుల సమన్వయంతో మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకొని గవిసిద్దేశ్వరస్వామి వారి దర్శనానికి విచ్చేసే భక్తులకు భద్రత కల్పించేందుకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తామని రాయదుర్గం రూరల్ సి.ఐ. వెంకటరమణ తెలిపారు. శనివారం డి.హిరేహాళ్ మండల పరిధిలోని గవిసిద్దేశ్వరస్వామి ఆలయంను ఆయన ఎస్ ఐ గురు ప్రసాద్ రెడ్డి తో కలసి సందర్శించి మహాశివరాత్రికి భక్తుల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఏర్పాట్లను పరిశీలించి ఆలయం వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటుకు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై ఆలయ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. హెచ్ సిద్దాపురం నుండి ప్రారంభమయ్యే అటవీ ప్రాంతంలో స్వామివారి సన్నిధికి చేరుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, సంఘటనలు చోటు చేసుకోకుండా వలయ( క్రాస్ ల్లో) ప్రాంతాల్లో ఎక్కడెక్కడ భద్రత ఏర్పాటు చేయాలన్న విషయాన్ని స్థానిక యువకులతో చర్చించి ఆ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు 25న ఆదివారం మహాశివరాత్రి సందర్భంగా గవిసిద్దేశ్వరస్వామి వారికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు చోటు చేసుకోకుండా భక్తుల వ్యయ, ప్రయాసలకు తావివ్వకుండా సులువుగా స్వామి వారిని దర్శించుకునే సౌకర్యాలు కల్పిస్తామని ఆయన చెప్పారు. స్వామివారి దర్శనం కు విచ్చేసే భక్తులకు భద్రత ఏర్పాట్లు కల్పించే విషయమై విద్యుత్తు, రెవెన్యూ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు లేఖలు పంపి సమన్వయంతో భక్తుల భద్రతకు సహకరించాలని కోరినట్లు సీఐ చెప్పారు.

# పెనుకొండ మున్సిపాలిటీ కాఫీ విత్ వైసిపి క్యాడర్

## ప్రజలతో మమేకమైన మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



పట్టణంలోని 6,7 వార్డులలో పర్యటిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ ఫిబ్రవరి 14 (ప్రభాతవార్త)

పెనుకొండ పట్టణంలోని 06,07వ వార్డుల లోనీ దర్గాసర్కిల్ నందు వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాఫీ విత్ వైసిపి క్యాడర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు మాజీమంత్రి ఉషశ్రీ చరణ్ పాల్గొని స్థానిక నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రతి గడపకు వెళ్లి, జగనన్న ప్రభుత్వం ఉన్నప్పుడు పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని, ఎప్పుడు ప్రజల శ్రేయస్సు కోరే జననాయకుడు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరికి గుర్తు చేశారు. రైతులకు ప్రతి ఏడాది రైతు భరోసా తో పాటు పంట బీమా ఇస్తూ రైతులకు భరోసాగా నిలబడ్డ ఏకైక నాయకుడు జగనన్న అని, అమ్మ ఒడి, వైయస్ఆర్ చేయూత, మహిళా సంఘాలకు రుణమాఫీ, సున్నా వడ్డీ, విద్యార్థులకు ఫీజ్ రియాంబర్స్మెంట్, చిన్న వ్యాపారులకు జగనన్న తోడు, టైలర్లకు, నాయి బ్రాహ్మణులకు, జూనియర్ లాయర్లకు, ఇలా అనేక సంక్షేమ పథకాల అందించిన జననేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ప్రజలకు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇప్పటికీ రెండు సంవత్సరాలు అవుతున్న ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలకు తీవ్రంగా అన్యాయం చేశారని రాష్ట్ర మాజీ మంత్రి, శ్రీసత్యసాయి జిల్లా వైయస్ఆర్ సీపీ అధ్యక్షురాలు పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్త కె.వి. ఉషశ్రీచరణ్ ప్రజలతో మమేకమవుతు వివరంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ కౌన్సిలర్ పుప్పం సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, మాజీ కన్వీనర్ లు శ్రీకాంత్ రెడ్డి, నాగలూరు బాబు, మాజీ సింగర్ విండో చైర్పర్సన్ ప్రకాష్ రెడ్డి, మండల వైస్ కన్వీనర్ కురుబవాండ్లపల్లి చెన్నకేశవులు, గుట్టూరు నారాయణస్వామి, గోనిపేట సోమశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు. 6,7వ వార్డుల వైసిపి నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి వార్డు కమిటీ నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పెనుకొండ మండల, పట్టణ ప్రజా ప్రతినిధులు, బోయ బాబు, కౌన్సిలర్లు సద్దాము, శేషాద్రి, వైసిపి నాయకులు, కొండల రాయుడు, మహేష్ రెడ్డి, కురుబవాండ్లపల్లి ఆంజనేయులు, పూజారప్ప, నరసింహులు, కొండంపల్లి భూమా నాగిరెడ్డి, మరువపల్లి వెంకటేశులు, రాంపురం చిన్న ఆంజనేయులు, వైసీపీ కార్యకర్తలు, కోనాపురం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# కొండాపురం రోడ్డుకు మహర్దశ

## -రూ.కోటి ఖర్చుతో...కొండాపురానికి తారు రోడ్డు నిర్మాణానికి నాంది



భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త



కార్యక్రమంలో పాల్గొన్న కూటమి నాయకులు

ఎన్నో ఏళ్లుగా కొండాపురం గ్రామానికి రహదారి సరిగా లేక ఎంతోమంది ఎన్నో పార్టీల నాయకులకు గ్రామస్తులు మొరపెట్టుకున్నా ఆ గ్రామానికి తారు రోడ్డు కలగానే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో స్థానిక పార్టీ మండల నాయకుల అభ్యర్థన మేరకు మంత్రి సవితమ్మ ప్రత్యేక చొరవతో కోటి రూపాయల నిధులు మంజూరు చేసి ఆ గ్రామానికి తారు రోడ్డు వేసేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శనివారం తెలుగుదేశం పార్టీ గోరంట్ల మండల కన్వీనర్ గుత్తా బాలకృష్ణచౌదరి ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సోమశేఖర్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, టిడిపి జిల్లా కార్యదర్శి నరేష్‌కుమార్, నిమ్మల శ్రీధర్, గోరంట్ల మేజర్ పంచాయతీ సర్పంచు సరోజ నాగేనాయక్, పాలసముద్రం గౌనివారిపల్లి సింగిల్ విండో అధ్యక్షులు బెల్లాలచెరువు చంద్ర, రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, బిజెపి, జనసేన అధ్యక్షులు లక్ష్మీనారాయణ, సంతోష్, యువదళం అధ్యక్షులు పచ్చ అశోక్, సింగిల్ విండో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ నబిరసూల్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవాంగం శ్రీనివాసులు, మార్కెట్ వైస్ చైర్మన్ తిరుపాల్, టౌన్ కన్వీనర్ కక్కల రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎంపిపి నిమ్మల విద్యాధరణి, సీనియర్ నాయకులు వెంకటరంగారెడ్డి, పంచాయతీ అధ్యక్షులు సురేష్, నాయాజ్, సికిందర్, హరికుమార్, మంజునాథ్, కుమార్, నరేష్, సూరి, లక్ష్మయ్య, నరేంద్ర, శేఖర్, గాజుల వేణుగోపాల్, వెంకటేష్, శ్రీధర్, నరసింహులు, పసుపులేటి శ్రీనివాసులు, మేదర శ్రీనివాసులు, మహమ్మద్, కురవ మల్లికార్జున, కలీం, అచ్యుత్‌చౌదరి, వృషబ, సోమశేఖర్, హుసేన్‌ఖాన్, ఎస్‌వి నారాయణ, శంకర, రాజారెడ్డి, బాలకృష్ణ, హరీష్,, సుభహాన్, శ్రీశైలం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులు, తండావాసులకు, ఆదివాసులకు అందాల్సిన ప్రభుత్వ లబ్ది అందేలా చూడాలి.

## - ఒక ఫిర్యాదు చేస్తే చాలు న్యాయ బద్ధంగా ఉంటే తప్పకుండా పని జరిగేలా అధికారులకు ఆదేశాలు ఇస్తాం.

## - జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు.

అనంతపురం రూరల్ , ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

ఎస్టీగిరిజనులు, తండావాసులకు, ఆదివాసులకు అందాల్సి న ప్రభుత్వ సంక్షేమ పథకాలు, లబ్ది అందేలా చూడాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సే న్ పేర్కొన్నారు. శనివారం అనంతపురం రూరల్ మండలంలోని కురుగుంట సేవాలాల్ కాలనీలో జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సే న్ పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని, అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేసి, సమస్యలుపరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు ఆదేశించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్టీ కమీషన్ సభ్యులు జాటోతు హుస్సే న్ మాట్లాడుతూ జాతీయ ఎస్టీ కమీషన్ విధి విధానాలు, పని తీరుపై వివరించడం తన బాధ్యతగా తెలుపుతూ ఉన్నానని, అధికారులు తమ పరిధిలో ఎస్టీ గిరిజనుల, తండా వాసులకు, ఆదివాసులకు అందాల్సి న ప్రభుత్వ లబ్ది అందేలా చూడాలని, లేదంటే జాతీయ ఎస్టీ కమిషన్ కి ఫిర్యాదు అందితే ఢిల్లీ కిఅధికారులు రావాల్సి ఉంటుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకుఅందాల్సి న అన్ని ప్రభుత్వ పథకాలను అందేలాఅధికారులు సేవా దృకృథంతో పని చేయాలని సూచించారు. అధికారుల నుండి పనులు కానప్పుడు గిరిజనులుకోర్టులనుఆశ్రయించాలంట "కోర్టు ఫీజుకూడకట్టుకోలేని వారికి ఈ జాతీయ ఎస్టీ కమిషన్ అండగాఉంటుందని, ఒక ఫిర్యాదు చేస్తే చాలు తప్పకుండా న్యాయ బద్ధంగా ఉంటే తప్పకుండా పని జరిగేలా అధికారులకు ఆదేశాలు ఇస్తామని, కమిషన్ కి జ్యుడీషియల్ అధికారాలు ఉన్నాయన్నారు. ఎస్టీలకు సంబంధించిన సమస్యలను ఎన్,సిఎస్టిగ్రామ్స్ .గవర్నమెంట్ .ఇన్ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ లో ఫిర్యాదు చేయవచ్చని, వాటిని వెంటనే స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటింటికి త్రాగునీరు, ఉపాధి హామీ అమలు, గ్రామీణ రహదారులు అభివృద్ధి, జాతీయ రహదారుల అభివృద్ధి, రేషన్ తదితర అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో సుమారు 100 జిల్లాలలో గిరిజనుల ప్రాంతాల్లో తిరిగి వారికి న్యాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ కొన్ని సమస్యలు మా దృష్టికి రావడం జరిగిందని, వాటిపై అవగాహన కల్పించడం మా బాధ్యత అని, అధికారులు అహంకారం చూపరాదని, ప్రజలకు సేవ మాత్రమే చేయాలన్నారు. సమస్యలు మాకు తెలిపితే వెంటనే దానినిటేకప్, చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కేశవనాయుడు మాట్లాడుతూ గ్రామంలో రెవెన్యూకి సంబంధించి చట్టప్రకారం సమస్యల పరిష్కారానికి అన్నిచర్యలుతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, రూరల్ తహసీల్దార్ మోహన్ కుమార్, ఎంపిడిఓ దివాకర్, పంచాయతీ అభివృద్ధి అధికారి సర్దార్ వలి, సీఐ శేఖర్, ఎస్సై రాంబాబు, డాక్టర్ మనోజ్, వీఆర్వో రామకృష్ణ, ఏఐబిఎస్ఎస్ ఎపి స్టేట్ ప్రెసిడెంట్ బాన్సోత్ చక్రి నాయక్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లుఆశ్రమంచైర్ .పర్సన్.డాక్టర్. ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. స్వామి దయానంద సరస్వతి ఆశ్రమంలో విద్యార్థులకు అన్నదానం చేశారు. ట్రస్టు సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించారు. అన్నదానంతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్మలమురళి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఉన్న దానిలో విద్యార్థులు సర్దుకుపోయే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. చదువుకు మించిన సంపద లేదన్న విషయాన్ని గ్రహించి ప్రతి ఒక్కరూ చదువులో రాణించాలన్నారు. మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని, సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని చెప్పారు. కార్యక్రమంలో ఆశ్రమం నిర్వాహకులు స్వామి సత్యాత్మానంద, చక్రపాణి ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ అభివృద్ధి అధికారుల పైన పని వత్తిడి తగ్గించాలి



సమావేశం నిర్వహిస్తున్న పంచాయతీ అభివృద్ధి అధికారులు.

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 14 ప్రభాతవార్త

పంచాయతీ అభివృద్ధి అధికారులపై ప్రభుత్వం పని ఒత్తిడిని తగ్గించాలని వారు కోరారు. శనివారంఅనంతపురంరూరల్, మండలకార్యాలయం లో జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం లో పంచాయతీ అభివృద్ధి అధికారులు పైన పని వత్తిడి, పన్నులు వసులు టార్గెట్, సర్వే ల వత్తిడి తదితర విషయాలు పైన సమావేశం లో చర్చించారు. అదే విధంగా ఏ డిపార్ట్మెంట్ లో లేని పని వత్తిడి, పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ లో ఒక్కటే పై అధికారులు వత్తిడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేయడమైనది, అదే విధంగా ప్రభుత్వం కు మా యొక్క విన్నపం పని వత్తిడి తగ్గించాలని ప్రభుత్వ పెద్దలను వేడుకుంటున్నాము, లేని యెడల భవిష్యత్ లో పంచాయతీ అభివృద్ధి అధికారులు తదుపరి కార్యాచరణ ప్రకటించి ప్రభుత్వానికి సహాయ నిరాకరణ దిశగా ముందుకు సాగుతామని తెలియజేసారు. ఈ కార్యక్రమములో జిల్లా పంచాయతీ అభివృద్ధి అధికారులు సర్దార్ వలి, వర్ల శంకర్, అరుణ్, రాఘువ, రవి, రామాంజినేయులు, పవన్, చరణ్, గోవిందా రెడ్డి, వెంకట్ రెడ్డి, అభిదుల, కుళ్లాయి, గోపాల్ రెడ్డి, దివాకర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

## ఆట



## సచిన్ శివతాండవం

*2003 వన్డే ప్రపంచకప్*
*సరిగ్గా శివరాత్రి రోజే*
*దాయాది పాకిస్థాన్‌తో మ్యాచ్*
*మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్*
*టీమిండియా ముందు 274 రన్స్ టార్గెట్*

టీమిండియాలోనూ, భారత్‌లోనూ ఒకటే టెన్షన్. కారణం అంతకుముందు నెదర్లాండ్స్, ఆస్ట్రేలియా మ్యాచ్‌ల్లో విఫలమైన టిమిండియా బ్యాటింగ్. మరో కారణం ఎదురుగా వకార్ యూనిస్, వసీం అక్రమ్, షోయబ్ అక్తర్, రజాక్‌లతో కూడిన భీకర పేస్ దళం.

వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి క్రీజ్‌లోకి వచ్చిన మాస్టర్ బ్లాస్టర్ పిచ్‌పై శివతాండవం చేశాడు. రెండో ఓవర్ నుంచి పాక్ బౌలర్లకు చుక్కలు చూపాడు. అక్తర్ తొలిఓవర్లోనే థర్డ్ మ్యాన్ దిశగా భారీ సిక్స్‌తో ఆరంభించిన సచిన్ తాండవం అలా అలా కొనసాగింది. ఆఓవర్లో మరో రెండు బౌండరీలు మొత్తం 18 రన్స్ వచ్చాయి. బీరాలు పలికిన రావల్పిండి ఎక్స్‌ప్రెస్ అక్తర్.. సచిన్ దెబ్బకు బీరుపోయాడు.

53 పరుగులకే సెహ్వాగ్, గంగూలీ వికెట్లను కోల్పోయినా సచిన్ తగ్గలేదు. శివుడే ఆవహించాడా అన్న తీరుగా పాక్ బౌలర్లపై తాండవ నృత్యం చేశాడు. 75 బంతుల్లోనే 12 ఫోర్లు, ఓసిక్స్‌తో 98రన్స్ సాధించాడు. బ్యాటింగ్ మాస్ట్రో ఇచ్చిన ధైర్యంతో ద్రావిడ్, యువరాజ్ కూడా ధాటిగా ఆడి మరో 5ఓవర్లు ఉండగానే దాయాదిపై విక్టరీ అందించారు.

# సరిహద్దు వేడి పిచ్ పైకి.. భారత్-పాక్ క్రికెట్ సంగ్రామం

# కోట్లాది హృదయాల ధడక్! ధడక్!!

*భారత్-పాక్ మ్యాచ్ అంటే ఇరు దేశాల్లోనూ ఓ ఉత్కంఠ*
*ఆపరేషన్ సింధూర్ తర్వాత ఓ రకమైన ఉద్విగ్న వాతావరణం*
*షేక్‌హ్యాండ్స్ ఇచ్చుకోవడం కూడా మానేసిన భారత్-పాక్ ఆటగాళ్లు*
*సంబంధంలేని బంగ్లా వివాదంలో తలదూర్చి పాక్ మరింత ఆజ్యం*
*మొదట భారత్‌తో ఆడేది లేదని పాకిస్థాన్ మొండిపట్టు*
*ఐసీసీ ఒత్తిడితో వెనక్కి తగ్గడంతో మ్యాచ్ మరింత ఉత్కంఠ*

**కొలంబో:** ఎట్టకేలకు టోర్నీ ఆఫ్ ది మ్యాచ్‌కు రూట్ క్లియర్ అయింది. చిరకాల ప్రత్యర్థులు భారత్, పాక్ జట్లు కొలంబో వేదికగా ఆదివారం మ్యాచ్ ఆడబోతున్నాయి. అసలు ఈ మ్యాచ్ జరుగుతుందా? లేదా? అన్న ఎపిసోడ్‌తో మ్యాచ్‌కు మరింత హైప్ వచ్చింది. ఈ మ్యాచ్ కోసం భారత్, పాకిస్థాన్ దేశాల్లోని కోట్లాది మంది ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. తమ జట్టే గెలవాలని ఇరు దేశాల అభిమానులు బలంగా కోరుకుంటుండడంతో ఆటగాళ్లలోనూ ఒత్తిడి నెలకొంది. రెండేసి విజయాలతో ఉన్న భారత్, పాకిస్థాన్ జట్లు ఈ మ్యాచ్ కు రెడీ అయ్యాయి. 2003 శివరాత్రి నాటి ఫలితమే ఇపుడూ పునరావృతం కావాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు.

ఇప్పటికే ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి సూర్యసేన మంచి ఊపులో ఉంది. అదే జోరును దాయాది జట్టుపై కూడా కొనసాగించాలని భావిస్తోంది. రెండు మ్యాచ్‌లు కూడా అమెరికా, నమీబియావంటి క్రికెట్ కూనలపై కావడంతో ఇపుడు టీమిండియా అసలుసిసలు పరీక్ష ఎదుర్కోబోతోంది.

**వచ్చేస్తున్న విధ్వంసకర ఓపెనర్**

నమీబియాతో మ్యాచ్‌కు దూరమైన విధ్వంసకర ఓపెనర్ అభిషేక్.. హైవోల్టేజ్ మ్యాచ్‌కు అందుబాటులోకి రావడం టీమిండియా అభిమానులకు శుభవార్తే. భారత బ్యాటింగ్ మరింత బలోపేతం కానుంది. శాంమ్సన్‌ను పక్కనపెట్టే అవకాశం ఉంది. ఇషాన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్‌లతో భారత్ బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. ఇటీవలికాలంలో ఈ ఆటగాళ్లందరూ చక్కగా రాణిస్తూ భారత్‌కు అద్భుతవిజయాలు అందిస్తున్నారు.

**ఫ్లయింగ్ స్టార్ట్ అదరాల్సిందే...**

తొలి బంతినుంచే ఎదురుదాడికి దిగే అభిషేక్ శర్మకు ఇషాన్ కిషన్ కూడా తోడై భారత్‌కు ఫ్లయింగ్ స్టార్ట్ అందిస్తున్నారు. ముఖ్యంగా ఇషాన్ కిషన్.. న్యూజిలాండ్ సిరీస్ నుంచి సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. నమీబియాపై కూడా మెరుపులు మెరిపించాడు. ఇద్దరూ పాకిస్థాన్‌పై జోరు చూపితే భారీ స్కోరు ఖాయం. తరువాత వచ్చే హైదరాబాదీ లయన్ తిలక్ వర్మ చక్కని స్కోర్లు సాధిస్తున్నాడు. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్.. చక్కని ఫామ్‌లోకి వచ్చాడు. అమెరికాపై భారత్ ఇన్నింగ్స్‌ను ఒంటిచేత్తే నిలబెట్టాడు. ఇక ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, అక్షర్ పటేల్ బ్యాటింగ్‌లో మెరుపు మెరిపించగలవారే. నమీబియాపై లాగే పాక్‌పై విరుచుకుపడడానికి హార్దిక్ ఎదురుచూస్తున్నాడు. బ్యాటింగ్ మరింత పటిష్టంగా ఉండాలనుకుంటే రింకూ సింగ్‌ను తుది జట్టులో కొనసాగించే అవకాశం ఉంటుంది. అమెరికాపై మ్యాచ్‌లో లాగా నిర్లక్ష్యం చూపకుండా పాక్‌తో మ్యాచ్‌లో అప్రమత్తతతో ఆడితే భారత బ్యాటింగ్‌కు తిరుగుండదు.



**వికెట్ల వేటలో...**

భారత బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా పాకిస్థాన్‌ను కట్టడి చేసే స్థాయిలోనే ఉంది. అర్షదీప్ సింగ్ స్థానంలో హైదరాబాదీ పేసర్ మహ్మద్ సిరాజ్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. అమెరికా మ్యాచ్‌లో మూడు వికెట్లు తీసి సత్తా చాటాడు. పేస్ త్రయం యార్కర్ కింగ్ జస్‌ప్రీత్ బుమ్రా- సిరాజ్- హార్దిక్ పాండ్య కాంబినేషన్ చక్కగా వర్కవుట్ అవుతోంది. ఇక ఏస్ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి తోడుగా అక్షర్ పటేల్ మిడిల్ ఓవర్లలో వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్లను హడలెత్తిసున్నారు. పాక్‌పై చక్కని ట్రాక్ రికార్డు ఉన్న కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకుంటే ఎవరిని పక్కన పెడతారన్నది ఆసక్తిగా మారింది.

**దాయాదిని లైట్ తీసుకోలేం..**

సల్మాన్ అఘా కెప్టెన్సీలోని పాకిస్థాన్ జట్టును తక్కువ అంచనా వేయలేం. ముఖ్యంగా భారత్‌పై మ్యాచ్ అంటే గెలవాలన్న కసితో పాక్ ఆటగాళ్లు ఆడాలనుకోవడమే ఆ జట్టు బలం. అయితే ఐసీసీ టోర్నీల్లో భారత్‌పై వారికి ఉన్న బ్యాడ్ రికార్డే మైనస్. పాకిస్థాన్ జట్టు ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో పటిష్టంగానే ఉంది. ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్... అమెరికాపై 73 పరుగులు సాధించి ఫామ్‌లోకి వచ్చాడు. మరో ఓపెనర్ సయిమ్ అయూబ్ చక్కని స్కోర్లు చేయడంలో విఫలమవుతున్నాడు. ఆ తర్వాత వచ్చే సల్మాన్ ఆఘా, బాబర్ ఆజమ్, నవాజ్, ఫహీమ్ అశ్రమ్ బ్యాటింగ్‌లో రాణిస్తే దాయదికి తిరుగుండదు. బౌలింగ్‌లో షహీన్ అఫ్రిది తురుపుముక్కగా ఉన్నాడు. భారత్‌పై అతనికి చక్కని రికార్డు ఉండడం కూడా కలిసి వచ్చే అంశం. విభిన్న బౌలర్ ఉస్మాన్ తారిక్‌పై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. అబ్రార్ ఆహ్మద్, అయూబ్, షాదాబ్ ఖాన్... భారత్ బ్యాటింగ్‌ను ఎంతవరకు కట్టడి చేస్తారన్న అంశంపైనే పాక్ గెలుపు ఆధారపడి ఉంది.

**తొంగిచూస్తున్న వరుణుడు**

కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా జరగనున్న హైటెన్షన్ మ్యాచ్‌కు వరుణుడు కూడా తొంగి చూస్తున్నాడు. కొలంబోలో ఆదివారం వర్షం కురిసే అవకాశం 90 శాతం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఒకవేళ మ్యాచ్ రద్దయితే పరిస్థితి ఏంటి? ఇది గ్రూప్ స్టేజ్ మ్యాచ్ కావడంతో రిజర్వ్ డే ఉండదు. మరో రోజు మ్యాచ్ నిర్వహించే అవకాశం ఉండదు. ఓవర్లు తగ్గించి అయినా ఆడించేందుకు అంపైర్లు ప్రయత్నిస్తారు. సాధ్యంకాకపోతే ఇరు జట్లకు చెరో పాయింట్ లభిస్తుంది.

**జట్ల అంచనా : భారత జట్టు:** ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), హార్దిక్ పాండ్య, శివమ్ దూబే, రింకూసింగ్/సిరాజ్, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా

**పాకిస్థాన్ జట్టు:** షాహిబ్జాదా ఫర్హాన్, సయిమ్ అయూబ్, సల్మాన్ ఆఘా(కెప్టెన్), బాబర్ ఆజమ్, షాదాబ్ ఖాన్, ఉస్మాన్ ఖాన్/ఫకర్ జమాన్, మహ్మద్ నవాజ్, ఫహీం అశ్రఫ్, షాహీన్ అఫ్రిది, ఉస్మాన్ తారీక్, అబ్రార్ అహ్మద్



## సూపర్-8కి గట్టెక్కిన ఇంగ్లండ్

**న్యూఢిల్లీ:** టీ20 ప్రపంచకప్‌లో ఇంగండ్ మళ్లీ పుంజుకుంది. వెస్టిండీస్ చేతిలో కంగుతిన్న బ్రూక్ సేన శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో స్కాట్లాండ్‌పై విజయంతో సూపర్ 8 రేసులోకి దూసుకొచ్చింది. హిట్టర్లతో నిండిన ఇంగ్లండ్‌ను స్కాట్లాండ్ బౌలర్లు బెంబేలెత్తించి సవాల్ విసిరారు. ప్రధాన ఆటగాళ్లు విఫలమైనా టామ్ బ్యాంటన్(63 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. 19వ ఓవర్లో విల్ జాక్స్(16 నాటౌట్) 4, 6 బాదడంతో 5 వికెట్ల తేడాతో గెలిచింది. స్కాట్లాండ్ సైతం రెండుసార్లు ఛాంపియన్ ఇంగ్లండ్‌కు షాకిచ్చేలా కనిపించింది. కానీ, టామ్ బ్యాంటన్(63 నాటౌట్) ఒంటరి సైనికుడులా పోరాడి జట్టుకు ఓటమి తప్పించాడు. 153పరుగుల ఛేదనలో తొలి ఓవర్లోనే మెక్‌ముల్లెన్(123).. డేంజరస్ ఓపెనర్ ఫిల్ సాల్ట్(2)ను ఔట్ చేసి ఇంగ్లండ్‌కు షాకిచ్చాడు. రెండో ఓవర్లో జోస్ బట్లర్(3) సైతం డగౌట్ చేరగా, బ్యాంటన్, జాకబ్ బెథెల్(32) మూడోవికెట్‌కు 66పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్‌ను గెలుపు దిశగా నడిపిస్తున్న ఈ ద్వయాన్ని డేవిడ్‌సన్ విడదీశాడు. బెథెల్ ఔటయ్యాక హ్యారీ బ్రూక్(4), సామ్ కరన్(28) సాయంతో బ్యాంటన్ పోరాడి స్కాట్లాండ్ ఆశలపై నీళ్లు చల్లాడు. 17 బంతుల్లో 15 పరుగులు అవసరమైన దశలో విల్ జాక్స్(16 నాటౌట్) ధనాధన్ ఓడించడం గ్లండ్ ఓటమిని తప్పించుకుంది. అంతకుముందు ఆదిల్ రషీద్(3/36) స్పిన్ ధాటికి స్కాట్లాండ్ బ్యాటర్లు చేతులెత్తేశారు. మైఖేల్ జోన్స్(33), రిచీ బెరింగ్టన్(49)ల మెరుపులతో ఆ జట్టు152 పరుగులు చేయగలిగింది. ఇంగ్లండ్ బౌలర్లలో ఆర్చర్(2/24), లియాం డాసన్(2/34)లు రెండేసీ వికెట్లతో రాణించారు.

## నిత్య, స్నేహిత్ రికార్డు విజయాలు మానవ్-ఠక్కర్, మనుష్-దియా నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ చెన్నై 2026లో భారత్ ప్లేయర్లు సురవాజ్జుల స్నేహిత్, నిత్య మణి రికార్డు స్థాయిలో భారీ విజయాలు నమోదు చేసి పురుషుల, మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకోగా, మానవ్-ఠక్కర్, మనుష్ షా-దియా చితాలే ఓటమితో నిష్క్రమించారు. స్నేహిత్ మొదట 0-2 తేడాతో పోరాడి మ్యాచ్‌ను నిర్ణయాత్మక రౌండ్‌లోకి తీసుకున్నాడు. మూడవ మ్యాచ్ పాయింట్‌ను 52 నిమిషాల్లో 3-2 (9-11, 15-17, 11-4, 11-6, 18-16) తేడాతో గెలుచుకుని టాప్ సీడ్ ఓహ్ జున్‌సంగ్‌తో రౌండ్ ఆఫ్ 16 పోరుకు సిద్ధమయ్యాడు. ప్రపంచ 481వ ర్యాంకర్ నిత్యా, రెండో రౌండ్ పోరులో 14వ సీడ్ ఆస్ట్రేలియాకు చెందిన జీని 3-2 (10-12, 12-10, 8-11, 11-7, 11-7) తేడాతో ఓడించింది. నాల్గవ సీడ్ చైనీస్ తైపీకి చెందిన చెంగ్ ఐచింగ్‌ను 3-1 (11-9, 11-5, 11-13, 11-5) తేడాతో ఐహికా ముఖర్జీని ఓడించింది. పురుషుల ప్రీక్వార్టర్స్‌కు 10వ సీడ్ జి. సత్యన్, 15వ సీడ్ మనుష్ షా కూడా చేరుకున్నారు. సత్యన్ కొరియా రిపబ్లిక్‌కు చెందిన లిమ్ జోంగ్‌హూన్‌ను 3-1 (11-7, 9-11, 11-9, 13-11) తేడాతో ఓడించగా, మనుష్ మరో కొరియాకు చెందిన పార్క్ గ్యుహ్యోన్‌ను 11-6, 11-7, 11-9 తేడాతో ఓడించాడు. ఇక పయాస్-సింగ్రెలా దాస్ 3-1 తేడాతో మనుష్-దియా చిటాలేలను ఓడించి మిక్స్‌డ్ డబుల్స్ సెమీఫైనల్‌కు చేరుకున్నారు.

## ఒమన్‌పై ఐర్లాండ్ ఘనవిజయం

**న్యూఢిల్లీ:** టీ20 వరల్డ్ కప్‌లో రెండు వరుస ఓటముల తర్వాత ఐర్లాండ్ అద్భుతమైన కమ్‌బ్యాక్ ఇచ్చింది. ఒమన్‌పై జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. కొలంబో వేదికగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఐర్లాండ్ బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించి 96 పరుగుల భారీ విజయాన్ని నమోదు చేశారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్‌కు ఒమన్ బౌలర్లు ఏమాత్రం అడ్డుకట్ట వేయలేకపోయారు. ప్రారంభం నుంచే ఐర్లాండ్ బ్యాటర్లు ధాటిగా ఆడారు. కెప్టెన్ లోర్కాన్ టక్కర్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో జట్టును ముందుండి నడిపించాడు. టక్కర్ సెంచరీ మిస్ చేసుకున్నప్పటికీ (94) నాటౌట్‌గా భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. అతనికి తోడు గెరెత్ డెలానీ (56) అద్భుత అర్ధ శతకంతో అలరించగా, ఇన్నింగ్స్ చివరలో జార్జ్ డాక్రెల్ విధ్వంసం సృష్టించడంతో ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 235 పరుగుల భారీ స్కోరు చేసింది. ఐర్లాండ్ సాధించిన ఈ స్కోరు వారి టీ20 అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక స్కోరుగా రికార్డులకు ఎక్కింది. ఒమన్ బౌలర్లలో షకీల్ అహ్మద్ 3 వికెట్లు తీసినప్పటికీ భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. ఇక 236 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్‌కు ఆరంభం ఆశాజనకంగా ఉన్నా అది ఎక్కువ సేపు నిలవలేదు. ఓపెనర్ అమీర్ కలీమ్(50), హమ్మద్ మీర్జా(46) పోరాడినప్పటికీ మిగిలిన బ్యాటర్లు చేతులెత్తేశారు. ఐర్లాండ్ పేసర్ జోషువా లిటిల్ 3 వికెట్లు పడగొట్టి ఒమన్ పతనాన్ని శాసించగా, మాథ్యూ హంఫ్రీస్, బారీ మెకార్తీ చెరో 2 వికెట్లతో రాణించారు.

## టాప్ 40 టెక్ సిఇఒలతో ప్రధాని మోడీ భేటీ



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** కృత్రిమమేధ ప్రభావసదస్సు 2026ను ప్రారంభించనున్న ప్రధానిమోడీ సదస్సులో పాల్గొంటున్న 40 మంది టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్‌లతో భేటీ కానున్నారు. ఈనెల 19వ తేదీ ఈ భేటీ ఉంటుందని అంచనా. మోడీ ప్రభుత్వం ఇప్పటికే ఎఐ సదస్సుద్వారా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో ఉంది. మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ సంస్థలు సమిష్టిగా ఇప్పటికే 67.5 బిలియన్ డాలర్లు ఎఐడేటా సెంటర్ మౌలికవసరులపై పెట్టుబడులు పెడతామని చెపుతున్నారు. మొత్తం 100కిపైగా టాప్ గ్లోబల్ టెక్‌సంస్థలు, 800 మందికిపైగా భాగస్వామ్య కంపెనీలు, ప్రభుత్వ అధికారులు విఐపిలు ఎందరో హాజరుకానున్నారు. వారంతా గతంలో ఇచ్చిన హామీలకు మించి పెట్టుబడుల హామీ ఇస్తారని చెవుతున్నారు. మేజర్‌గ్లోబల్‌కంపెనీలు నెట్‌ఫ్లిక్స్, జూమ్, అమెజాన్ వంటివికూడా ఈ చర్చల్లో పాల్గొంటాయి. కేవలం ఎన్వీడియా సంస్థ సిఇఒ హుంఆగ్‌జెనెసన్‌మాత్రం హాజరుకావడంలేదని ప్రకటించారు. అయితే ఉన్నతస్థాయి ప్రతినిధిని పంపిస్తారని చెపుతున్నారు. ప్రధానమంత్రి సిఇఒలమధ్య జరిగే కీలక చర్చల్లో పెట్టుబడులు, వాణిజ్యం, ఎఐ అమలుద్వారా భారీస్థాయిలో ఉపాధి సృష్టి వంటి వాటిపై ఉంటాయని కేంద్రం చెపుతోంది.





## ఎయిరిండియాకు డిజిసిఎ కోటి జరిమానా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఎయిర్‌వర్దీనెస్ అనుమతులు లేకుండా ఎయిరిండియా ఎయిర్‌బస్ విమానం ఎనిమిదిసార్లు పర్యటించడంతో డిజిసిఎ ఎయిర్‌ఇండియాపై ఒక కోటి రూపాయలు జరిమానా విధించింది. ఇలాంటి లోపాలు సంస్థపట్ల ప్రజల్లో నమ్మకం తగ్గిపోతుందని వెల్లడించింది. ఎయిర్‌బస్ ఎ320 ఎనిమిదిసార్లు ఇలాప్రయాణించి విభిన్నరంగాలకు సేవలందించింది. ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, హైదరాబాద్‌నగరాలకు గత ఏడాది నవంబరు 24,25 తేదీల్లో ఎలాంటి అనుమతులు క్లియరెన్సులు లేకుండాసేవలు అందించినట్లు డిజిసిఎ గుర్తించింది. ఎయిర్‌వర్దినెస్ రివ్యూ సర్టిఫికేట్ అనేది భద్రత, సెక్యూరిటీలపరంగా విమానాలు నడిపేందుకు ఇచ్చే క్లియరెన్సులుగా భావిస్తారు. అయితే ఎయిరిండియా మాత్రం వెంటనే స్పందించింది. డిజిసిఎ ఉత్తర్వులు అందాయి, 2025లో వెంటనే స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నట్లు తెలిపింది. గుర్తించిన సాంకేతిక లోపాలన్నీ పరిష్కరించామని, డిజిసిఎకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. ఈనెల ఐదవ తేదీతో వచ్చిన ఈ రహస్య జరిమానా ఉత్తర్వులు భారతీయ పౌరవిమానయాన అధికారులు, ఎయిరిండియా సిఇఒ క్యాంప్‌బెల్ విల్సన్‌లకు నివేదిక ఇస్తూ ఇలాంటి సంఘటనలవల్ల సంస్థభద్రతపై సందేహాలు పెరుగుతాయని అన్నారు. ఎయిర్‌లైన్స్ 30 రోజుల్లోపు రూ.1 కోటి చెల్లించాలని ఆజాయింట్ డైరెక్టర్ డిజిసిఎ మనీష్‌కుమార్ తెలిపారు.

## వారంలో ఎఫ్‌పిఐ పెట్టుబడులు రూ.14,160 కోట్లు

**ముంబయి, ఫిబ్రవరి 14:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు భారత్‌మార్కెట్లలో ఈ వారాంతానికి రూ.14,159.82 కోట్లు పెట్టుబడులు పెట్టారు. ఎన్‌ఎస్‌డిఎల్ డేటాను పరిశీలిస్తే ఒక్క మంగళశారంరోజునే 4069 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. సోమవారం కూడా 3094.88 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. గురువారం కూడా 3113.09 కోట్లు రాగా శుక్రవారం, బుధశారాల్లో స్వల్పంగా ఉన్నాయి. 2408.18 కోట్లు, 1473.68 కోట్లుగా ఈ రెండురోజుల్లోని పెట్టుబడులు నిలిచాయి. ఈక్విటీ మార్కెట్లు ఈ పెట్టుబడులతో మరింత దూసుకుపోయాయి. ఎఫ్‌పిఐలు 11,545.81 కోట్లు ఈక్విటీల్లో ఐదురోజుల్లో పెట్టుబడులుపెట్టారు. ఇక డెట్‌మార్కెట్లుకూడా 2896.21కోట్లు పెట్టుబడులు అందుకున్నాయి. ఒక్క శుక్రవారం రోజే 1511.86కోట్లు పెట్టుబడులు వచ్చినట్లు తేలింది. డెబ్ట్ జనరల్, డెట్ విఆర్‌ఆర్; డిట్ ఎఫ్‌ఎఆర్ సెగ్మెంట్లలో ఈ పెట్టుబడులున్నాయి. గురువారం30.58 కోట్లు రాగా బుధవారం 1133.86 కోట్లు, వచ్చాయి. మంగళవారం 435.70 కోట్లు, సోమవారం 448.91 కోట్లు పెట్టుబడులు వచ్చాయి. ఇక హైబ్రిడ్ స్కీంలలో మాత్రం 1146.75కోట్లు విత్‌డ్రాచేసుకున్నారు. ఒక్క వారం ప్రారంభంలోనే 1012.12కోట్లు విత్‌డ్రా అయ్యాయి అయితే మ్యూచ్వల్‌ఫండ్ స్కీంలలో మాత్రం 199.95 కోట్లు పెట్టుబడులు వచ్చాయి.





## ఇండామర్ టెక్నిక్ కంపెనీ కొనుగోలుచేసిన అదానీ

**ముంబయి, ఫిబ్రవరి 14:** ఆదానిగ్రూప్ ఇప్పటికే తన ఏరోస్పేస్ కార్యకలాపాలకోసం వివిధ కంపెనీలను కొనుగోలుచేస్తోంది. ఇందామర్ టెక్నిక్స్ కంపెనీని కొనుగోలుచేసి ఎంఆర్‌ఒ విభాగం, ఎయిర్‌క్రాఫ్ట్ సేవలు అందించేందుకు సిద్ధం అవుతోంది. ఆదాని ఎంటర్‌ప్రైజెస్‌నుంచి అనుబంధంగా ఉన్నహోరిజన్ ఏరోసొల్యూషన్స్ కంపెనీ 100శాతం ఐటిపిఎల్ వాటాలను షేర్ పర్చేజ్ ఒప్పందంతో కొనుగోలుచేసింది. వారాంతంలోనే స్టాక్ ఎక్ఛేంజిలకు కూడా తెలియజేసింది. ఐండామర్ టెక్నిక్స్ విలువలు రూ.330 కోట్లుగా ఉన్నాయి. ఈ డీల్‌ను గత ఏడాది ఆగస్టులోనే వెల్లడించారు. ఐటిపిఎల్‌కంపెనీ ప్రైవేటు ఎంఆర్‌ఒ కంపెనీల్లో లీడింగ్ సంస్థగా నిలుస్తోంది. అధునాతన 30 ఎకరాల వైశాల్యం ఉన్న మిహాన్‌సెజ్ నాగ్‌పూర్‌లో ప్రత్యేక ఫెసిలిటీని ఏర్పాటుచేసుకుంది. హోరిజాన్ ఏరో ప్రైవేటురంగ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హోల్ నిర్వహణ సంస్థగా ఉంది. ఈ సంస్థ ఆదాని డిఫెన్స్, ప్రైమ్ ఏరో రెండింటా 50:50వాటాతో నడుస్తున్నది. ప్రజాయ్‌పటేల్ ఇండామర్ టెక్నిక్స్ డైరెక్టర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కంపెనీ కొనుగోలును డిజిసిఎ ఆమోదించింది. ఫెడరల్ ఏవియేషన్ కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇతర గ్లోబల్ సివిల్ ఏరో రెగ్యులేటర్లు కూడా తమ సమ్మతి తెలిపాయి. నాగ్‌పూర్ కేంద్రంలో మొత్తం 15 ఎయిర్‌క్రాఫ్ట్ బేలు, పది హ్యాంగార్లమధ్యలోఏర్పాటయ్యాయి. ఆదానిగ్రూప్ ఇండియా ప్రైవేటు ఎయిర్‌పోర్టు ఆపరేటర్‌గా నిలిచింది. మొత్తం ఎనిమిది దేశీయ ఎయిర్‌పోర్టులు పర్యవేక్షిస్తోంది. ఇండియా ఎంఆర్‌ఒ పరిశ్రమ రానున్నరోజుల్లో మరింతగా వృద్ధిలోకి వస్తోంది. మౌలికవసరుల విస్తరణతో మరింతగా భారతీయులు ఎయిర్‌ట్రావెల్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు.



## స్పెయిన్ స్టార్టప్ ట్రెనెస్‌ను కొనుగోలుచేసిన ఇక్సిగో

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** ఆన్‌లైన్‌ట్రావెల్ పోర్టల్ ఇక్సిగో స్పెయిన్‌లోని రెండో అతిపెద్ద ఆన్‌లైన్‌ట్రైన్ బుకింగ్‌యాప్ ట్రెనెస్‌ను కొనుగోలుచేసింది. ఈ సంస్థలో 60శాతం వాటాను ఆన్‌లైన్‌ట్రెవెల్ సొల్యూషన్స్ ఎస్‌ఎల్‌ను సుమారు రూ.125 కోట్ల వాటాలను దక్కించుకున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజికి తెలిపింది. అదనంగా ంపెనీ స్పానిష్ స్టార్టప్ స్క్వాష్‌ను కూడా 45శాతం వాటాలు కొనుగోలుచేసింది. ఈ సంస్థ టెక్నాలజీ ఆధారిత పరిష్కారాల సేవలు అందిస్తోంది. ఈ స్టార్టప్‌లో 45శాతం వాటా ఐదు కోట్లుగా ఉంది. గత ఏడాది అక్టోబరులోనే ఇక్సిగో పదిశాతం వాటాల విక్రయంతో రూ.1296 కోట్లు ఆర్జించింది. ప్రోసస్ కంపెనీ కొనుగోలుచేసింది. ఈ కొనుగోలు సింగపూర్ అనుబంధ ఇక్సిగో సంస్థ ద్వారా జరిపింది. మొత్తం డీల్‌మార్చినెలాఖరుకే పూర్తి అవుతుందని వెల్లడించింది. ట్రెనెస్‌లో మిగిలిన వాటా కొనుగోలుకు కూడా ఇక్సిగో హక్కులు కలిగి ఉంది. 2013లో స్థాపించిన ట్రెనెస్ శరవేగంగా వృద్ధితో ఉన్న లాభదాయకత ఫౌండర్ సొంత ఆన్‌లైన్‌ట్రైన్‌టికెట్ ప్లాట్‌ఫామ్‌గా నిలిచింది. స్పెయిన్, దక్షిణ యూరోప్ ప్లాట్‌ఫామ్‌లలో భారీ స్థాయిలోకస్టమర్లను కలిగి ఉంది. అలాగే స్పానిష్, యూరోపియన్‌రైల్ ఆపరేటర్లతో పరస్పర ఒప్పందాలతో నడుస్తోంది. సుమారు 5.5 మిలియన్ యూరోలు అంటే 60 కోట్లు రాబడులు రూ.15 కోట్ల నికరలాభం ఆర్జించింది.

## ఆర్‌ఎంజడ్‌తో సిగ్నేచర్ గ్లోబల్ జాయింట్ వెంచర్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14:** న్యూఢిల్లీ కేంద్రంగాపనిచేస్తున్న రియల్ ఎస్టేట్‌సంస్థ సిగ్నేచర్‌గ్లోబల్ బెంగళూరు ఆర్‌ఎంజడ్‌తో కలిసి పనిచేసేందుకు ముందుకువచ్చింది. ఇందుకోసం 50శాతం జాయింట్‌వెంచర్ నడుపుతోంది. ఆర్‌ఎంజడ్‌తో కలిసి పనిచేయడంతోపాటు సిగ్నేచర్‌గ్లోబల్ రూ.1283 కోట్లు పెట్టుబడులకు కూడా ముందుకువచ్చిది. సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్‌ప్రదీప్ అగర్వాల్‌మాట్లాడుతూ ఆర్‌ఎంజడ్‌తో సంపూర్ణ భాగస్వామ్యంతో 55 లక్షల చదరపు అడుగుల వైశాల్యంలో మిశ్రమ వినియోగ వాణిజ్య ఆస్తులు రూపొందిస్తామని ప్రకటించింది. ఈ ఆప్రాజెక్టు ఒక్కటే రూ.7500 కోట్లు ప్రణాళికతో ఉంది. మొత్తం మూలధన విలువలు ప్రాజెక్టుపూర్తయేనాటికి సుమారు 14 నుంచి 16 వేలకోట్లవరకూ ఉంటుందని అంచనా. వీటితోపాటే సిగ్నేచర్ బ్రాండెడ్ నివాసిత యూనిట్లను వాణిజ్య కాంప్లెక్స్‌లకు చేరువలోనే నిర్మిస్తోంది. ఈలావాదేవీతోపాటు కంపెనీ గురుగ్రామ్ కామర్సిటీ, మిల్లీనియా రియాల్టర్స్ రెండూ కూడా ఎస్‌ఎస్‌పిఎ ఒప్పందానికి వచ్చాయి. ఈ ఒప్పందం కింద ఆర్‌ఎంజడ్ 50శాతం వాటాను జిసిఎల్‌లో కొనుగోలుచేస్తుంది. వాటాలకొనుగోళ్లు, లావాదేవీలతో సుమారు 1283 కోట్లమేర నిర్వహించనున్నట్లు తెలిపింది. ఈ ఒప్పందంతో వచ్చే మొత్తాల ద్వారా సిగ్నేచర్‌గ్లోబల్ రుణభారం లేని కంపెనీగా మారుతుందని ప్రకటించింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot No. B-11, B-12, Industrial Estate, Anantapur.-515004. Phone:9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No.70088/97. Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.No. HSD/337/18-20 Air Surcharge: Delhi: 40 Ps.